వ్యవస్థాపకులు

**కీ||శే|| మునుగంటి శ్రీరామమూర్తి**

గౌరవ సంపాదకులు

**డా|| శ్రీమాన్ కొమాండూరి శేషాద్రి**

సంపాదకుడు

**మునుగంటి వెంకట్రావు**

65వ సంవత్సరపు ప్రచురణ

# గానకళ

సంగీత మాసపత్రిక

అంతర్జాతీయ సంగీత మాసపత్రిక

సంపుటి - 65 | జూన్ 2026 | సంచిక - 1









65వ సంవత్సరపు ప్రచురణ

# గానకళ

అంతర్జాతీయ సంగీత మాసపత్రిక

30-1-29, రంగయ్యనాయుడువీధి, కాకినాడ - 533001, సెల్ : 9441488721

సహాయ సంపాదకులు

**శ్రీ వాసా గోపీనాధరావు**
విశ్రాంత ప్రిన్సిపాల్, సంగీత నృత్యకళాశాల, హైదరాబాద్

**శ్రీ మండలీక సీతారాఘవరావు**, చెన్నై

**శ్రీ కె.వి. బ్రహ్మానందం**
విశ్రాంతాచార్యులు, ప్రభుత్వ సంగీత నృత్యకళాశాల, విజయవాడ

**శ్రీ జయంతి సత్యనారాయణ శాస్త్రి**, కాకినాడ

సంపుటి - 65 | జూన్ 2026 | సంచిక - 1

## ఈ సంచికలో....

పేజీలలో

1. పాటకు పల్లవే ప్రాణం.... గతానికి స్వాగతం - శ్రీ మల్లాది సూరిబాబు ............ 3

2. శ్రీరంగనాథునికి ప్రియభక్త వాగ్గేయకారులు అల్లూరి వెంకటాద్రిస్వామి - శ్రీ ఆకొండి శ్రీనివాసరాజారావు ............ 7

3. నా సంగీతానుభవాలు - సుధా తరంగమ్ - శ్రీ మోదుమూడి సుధాకర్ ............ 20

4. సంగీత సభల కార్యకలాపములు - 'విహారి'. ............ 22

## ముఖచిత్రం

1. గాయత్రీ సంగీత సన్మండలి, గుంటూరు వారి "భక్త జ్ఞానానంద తీర్థ స్మారక అవార్డు "స్వీకరించిన ప్రముఖ సంగీత విద్వాంసురాలు విదుషి శ్రీమతి డా||గౌరీ రామ్మోహన్.

2. జూన్7న విశాఖలో స్వర్గీయ మృదంగ విద్వాంసులు విద్వాన్ శ్రీ వి.కమలాకరరావు90 వ జయంతి సందర్భంగా శిష్య ప్రశిష్యులతో 'నాదకమలాసన'బిరుదుతో సత్కరింపబడిన వాయులీన విద్వాంసులు శ్రీ ద్వారం దుర్గా ప్రసాదరావు మహోదయులు.

3. 28-05-2026 న కేంద్ర సంగీత నాటక అకాడమీ ఎవార్డ్ కు ఎంపికయిన విదుషి శ్రీమతి పంతుల రమ కు అభినందనపూర్వక సత్కారం నిర్వహించిన విశాఖ మ్యూజిక్ అకాడమీ సభ్యులు మరియు స్థానిక సంగీత సంస్థలు.

4. నెల్లూరు లో ది. 13.6.2026న జరిగిన పద్మభూషణ్ పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం జయంతి వేడుకలలో వారి స్మారక అవార్డు,'సంగీత స్వర ప్రవీణ' బిరుదు స్వీకరించిన ప్రముఖ సినీ సంగీత దర్శకులు శ్రీ స్వరవీణాపాణి.

Email : ganakalamagazine@yahoo.co.in కు కళాకారులు, సంస్థలు - వార్తలు, ఫోటోలు పంపవచ్చు.

ganakala.in వెబ్ పేజీలో గానకళ పూర్వ సంచికలు, కొత్త సంచికలు చూడవచ్చు.

గతానికి స్వాగతం

# పాటకు పల్లవే ప్రాణం....



- మల్లాది సూరిబాబు
ఫోన్ : 9182718656

రాజమండ్రి వీరేశలింగం హైస్కూల్ లో మా నాన్న గారు 1950-55 ఆ ప్రాంతంలో డ్రాయింగ్ మాష్టారుగా ఉద్యోగం చేసే రోజులలో హాస్య బ్రహ్మ భమిడిపాటికామేశ్వర రావు గారు గణిత ఉపాధ్యాయులుగా పని చేస్తూఉండేవారు. వీరిద్దరికి గాఢమైన స్నేహబంధం తో పాటు సంగీత సంబంధం కూడావుండేది. హాస్యం తొణికిసలాడే నాటికలకు భమిడిపాటి వారు పెట్టిందిపేరు.దంత వేదాంతం, గుస గుస పెళ్ళి, కాలక్షేపం, టాల్ స్టాయ్ కథలు, తనలో, నిజం కూడా అబద్ధమే, పెళ్ళి ట్రయినింగ్, హాస్య వల్లరి, ఈసఫ్ కథలు, ఇంకాఎన్నెన్నో నాటకాలు వ్రాసిన కామేశ్వర రావు గారు "త్యాగరాజు ఆత్మ విచారము" అనే పరిశోధనాత్మక గ్రంథం వ్రాశారు.

ఆ పుస్తకంలో విశేష మొకటి వుంది. అందరికీ తెలిసిన త్యాగ రాజువేరు, భమిడిపాటివారి హృదయంలో నివాసమున్న త్యాగయ్య వేరు. మీరు, నేనూ మాట్లాడు కుంటున్నంత అతి సహజమైనమాటలే త్యాగరాజకీర్తనల పల్లవులు.ఈపల్లవుల రచనా విధానమే వారిని ఆకర్షించింది. నిఘంటువు చూస్తే తప్ప అర్థం కాని మాటలంటూ స్వామివారి కీర్తనలలో వుండవు. ఆ పల్లవులతోనూ,ముగింపు చరణాలతోను, కలుపుకుంటూ త్యాగ రాజు ఆత్మ విచార గ్రంథాన్ని వ్రాసి పండిత పామరుల మెప్పునుపొందారు.

తెలిసి రామ చింతనతో నామము చేయవే ఓ మనసా, రామభక్తి సామ్రాజ్యమేమానవుల కబ్బెనో?మనసా!,మనసా ఎటులోర్తునో, ముద్దు మోము ఏలాగు చెలంగెనో, విదులకు మ్రొక్కెద- సంగీత కోవిదులకు మ్రొక్కెద, దుడుకుగల నన్నే దొర కొడుకు బ్రోచురా, ఎందరో మహానుభావులు అందరికీ వందనములు- ఇలా ఏపల్లవికి ఆపల్లవే సాటి.

త్యాగయ్య మనసులో అనుభూతి పుట్టిన మరుక్షణం మాటలు సిద్ధమై నిలచి సాక్షాత్కరించేవి. రామచంద్రుని కృపతో త్యాగయ్యకే లభించిన వరం అది. భమిడిపాటివారి ఆత్మ విచారం లో త్యాగయ్య కీర్తనల పల్లవులన్నీ ఒక మాలికగా తయారయి సంగీత ఋషిగా, విరాగిగా, స్థిత ప్రజ్ఞునిగా రామ చంద్రునికి అత్యంత ప్రీతిపాత్ర మైన భక్తునిగా మనకు త్యాగయ్యను దర్శింప చేసిన భమిడిపాటి వారి జన్మ ధన్యమయిందని మా నాన్న గారు తరచు అంటుండేవారు.. అదే స్ఫూర్తితో, 'త్యాగరాజు ఆత్మవిచారం' శీర్షికతో నే ఆంధ్రభూమి లో మాతండ్రి గారు మల్లాది శ్రీరామమూర్తి గారు

కొన్నేళ్ళ పాటు వ్యాసాలువ్రాశారు.

తెలిసినట్లే అనిపించి అగమ్యంగా కనిపించేది "సంగీతవిద్య".

గురుముఖతః నేర్చుకొనేది కొంతే.మిగతా జ్ఞానమంతా వినటం వల్ల సిద్ధించేదే.

అనంతమైనది రాగసముద్రం. ఎంతసేపు రాగం పాడినా కొంత మిగిలే వుంటుంది.ఒకే రాగం నిముషాల్లో పాడేసి ముగించవచ్చు లేదా గంటల తరబడి పాడవచ్చు. రోజులతరబడి పాడిన విద్వాంసులూ వుండేవారు.

ఆ రాగాలతోనే వారి పేర్లు స్థిరపడ్డాయి. ఉదాహరణకు "బేగడ" సుబ్రహ్మణ్యయ్యర్, శంకరాభరణం నరసయ్య, తోడి సీతారామయ్య వంటి మహాగాయకులు.

తోడిరాగం పేరుచెబితే మహా విద్వాంసు లందరూ ముక్త కంఠంతో స్మరించే పేరు నాదస్వర చక్రవర్తిగా ప్రసిద్ధుడైన టి. ఎన్. రాజరత్నం పిళ్ళై. గ్రామఫోన్ కంపెనీ వారు రాజరత్నం నాదస్వర వాద్యాన్ని ఏడు నిమిషాల సేపు ఈ. పి(EP)రికార్డ్ గా విడుదల చేశారు.

ఏడు నిమిషాల వ్యవధిలో ఆ రాగంలో ఎన్నెన్ని హొయలు పలికించారో మాటలలో వర్ణించలేం. ఆ తోడి రాగం వినని విద్వాంసుడంటూ లేరు. ఎంతసేపువిన్నా మళ్ళీ మళ్ళీ వినాలనిపిస్తుందే తప్ప అనుకరించే ప్రయత్నం ఎవరూ ఇంత వరకు చేయలేదు, నాకు తెలిసి.

నాకు ఓలేటిగారు ఓరోజు ఆ రాగం కొన్ని సెకన్లు పాడి వినిపించారు. అంటే స్వరం వ్రాసుకొని కంఠస్థం చేయగా స్వాధీనమైన సంగతులు యథాతథంగా పాడేశారు.

ఆయన ఏక సంథాగ్రాహి. అలాగే అబ్దుల్ కరీంఖాన్ పాడిన 'జమునా కే తీర్' అనే ఠుమ్రీ ని పినాకపాణి గారు కంఠస్థం చేసి నాకోరోజు పాడి వినిపించారు. శ్రద్ధావాన్ లభతే జ్ఞానం. గొంతులో గమకాలు శుద్ధంగా పలికించగల సత్తా లేనివారు తేలికగా పాడగల బాణీకి ఆసక్తి చూపించడం సహజం. ఆణిముత్యాలకు రంగుపూసలకూ తేడా వుండదూ?. ఏది మంచి సంగీతమో నిర్ణయించేది బుద్ధి.

ప్రసిద్ధ నాదస్వర విద్వాంసులు షేక్ చిన మౌలానా విజయవాడ ఆకాశవాణి కేంద్రానికి రికార్డింగ్ కోసం వచ్చిన సందర్భంలో బయట లాంజ్ లో కూర్చుని మాట్లాడుతూన్న సమయంలో రాజరత్నం పిళ్ళై ని ప్రస్తావించాను.

ఆయన వెంటనే ప్రతిస్పందిస్తూ, మద్రాసు మ్యూజిక్ ఎకాడమీ వారి "సంగీత కళానిధి" పురస్కారం అందుకొనే సందర్భంలో నా కచేరి మరునాడు ఏర్పాటుచేశారు. రాత్రి తెల్లవార్లు రాజరత్నం పిళ్ళై తోడి రాగం వింటూనే వున్నాను. కచేరీలో వినిపిద్దామని.

తెల్లవారిన తరువాత ఏ ఒక్క సంగతీ గుర్తుకు రాలేదంటే నమ్మండి.

రాజరత్నం ఓ గంధర్వుడు. శాపవశాత్తు భూమ్మీద పుట్టాడు. అంతే!. ఆయన నాదస్వరం దేవతలే వినాలి. ఆయన గాన గంధర్వుడు....

అన్నారు.

'త్యాగయ్య ఎలా గానం చేసి వుంటాడు' తెలియాలంటే ఆయన మొదటితరం శిష్యులే ఆధారం. వారిపాట ఎలా వుంటుందో కూడా చెప్పలేం. వారి ప్రశిష్యుల పాటే ఆధారం.

త్యాగయ్య గారి దగ్గర సంగీతంనేర్చుకొన్న వారిలో ఉమయాల్పురం కృష్ణ భాగవతార్, సుందర భాగవతార్ ముఖ్యులు. వీరి సోదరుడు వెంగు భాగవతార్(వెంకట్రామ భాగవతార్) అని పిలిచేవారు. ఉమయాల్పురంలో వుండేవారు. త్యాగయ్యగారంటే భక్తి గౌరవాలున్న మహాపండితుడు. 'త్యాగరాజం భజే' అనే ముద్రతో ఓ అష్టకం రచించాడు. తిరువయ్యారుకు ఉమయాల్పురం చాల దగ్గర. తమిళ, సంస్కృతాలలో ప్రావీణ్యంగల పండితుడు. స్వర జ్ఞానం , శ్రుతి జ్ఞానం కూడా తోడవ్వడం తో సంగీతం పట్ల అభిరుచి కూడా వుండడంతో వూళ్ళో రామాయణ ప్రవచనాలు చేస్తూ మధ్య మధ్య లో సంగీత ఉపన్యాసం తో శ్రోతలను ఆకర్షిస్తూ వుండే వాడు. ప్రత్యేకంగా ఉమ యాల్పురం వెళ్ళి త్యాగయ్య గారు ఆరు మాసాల పాటు ఆయన ప్రవచనాలు,సంగీతోపన్యాసాలు వినే వారట.

వెంగు భాగవతార్ కోరిక పై 1839 లో సుందర భాగవతార్, కృష్ణ భాగవతార్ 11,9 సంవత్సరాల వయస్సులో త్యాగయ్య వద్దకు సంగీత శిక్షణకోసం వెళ్ళారు. త్యాగయ్య గారి శిష్యుడైన జగద్రక్షక భాగవతార్ వద్ద ఆరు మాసాల పాటు ఈ ఇద్దరు సంగీతం నేర్చుకొన్నారు. వారిద్దరు నేర్చుకొన్న మొదటి కీర్తన ఈశమనోహరి రాగంలో " జానకీ మనోహర". త్యాగయ్య వద్ద వీరిద్దరి సంగీత శిక్షణ ఇంచుమించు అయిదారేళ్ళు సాగింది.

1947 లో మదరాసు మ్యూజిక్ అకాడమీ జర్నలు లో ఉమయాల్పురం,తిల్లస్థానం,వాలాజీపేట సాంప్రదాయాలు మూడునూ త్యాగరాజు కీర్తనలు ప్రచారం కావడానికి దోహద పడి నట్లు గా ప్రచురించారు. మద్రాసు లోని ఏ. ఎమ్. చిన్న స్వామి మొదలి యార్ ఓరియంటల్ మ్యూజిక్ ఇన్ యూరోపియన్ నోటేషన్ కోసం ఉమయాల్పురం సోదరులు త్యాగరాజ కీర్తనలు పాడారు. దీనివల్ల కీర్తనలకు బహుళ ప్రచారం లభించింది. 'గురులేక ఎటువంటి గుణికి తెలియగ బోదు ' అనే త్యాగయ్య గారి కీర్తన ఉమయాల్పురం వారు "గంభీర వాణి" రాగంలో పాడే వారట.( గంభీర వాణి గౌరీమనోహరి జన్యం).

కర్ణాటక సంగీత సౌరభాన్ని వెదజల్లేవి వర్ణాలే. వర్ణాలను తాన వర్ణాలంటారు. అక్షరాలు తక్కువ ,స్వరాలు ఎక్కువగా వుండి రాగ భావాన్ని ప్రస్ఫుటం గా చూపించ గలిగే మార్గ దర్శక రచనలే ఈ వర్ణాలు. అధిక సంఖ్యలో వర్ణాలు రచించిన వారిలో త్యాగయ్య శిష్యుడు వీణ కుప్పయ్యర్ ముఖ్యుడు.స్వాతి తిరునాళ్ ఆస్థానంలో త్యాగరాజు కీర్తనలు పాడి మహారాజు ప్రశంసలందుకొన్న కన్నయ్య భాగవతార్ త్యాగయ్య శిష్యుడే. స్వామి వారి శిష్య పరంపర లో మొదటి తరానికి చెందిన సుందర భాగవతార్, కృష్ణ భాగవతార్ లు వారి మనోధర్మం జోడించ కుండా త్యాగయ్య గారి

పాఠం యథాతథంగా పాడడం విశేషం. ఈ ఇద్దరిని కీర్తన విద్వాంసులని ప్రశంసిస్తూ వుండేవారట. కీర్తనలకు చిట్ట స్వరం కాని, మధ్య మధ్య స్వర కల్పన గాని లేకుండా కేవలం కీర్తనలు మాత్రమే నేర్చుకొన్నది నేర్చు కొన్నట్లుగా శుద్ధమైన కీర్తన పాడి, ఆ తరువాత సాహిత్య భావం తమిళంలో సోదాహరణ పూర్వకంగా చెప్పే వారట .

ఉమయాల్పురం సోదరులు వారి కుటుంబం ఇంచుమించు 175 ఏళ్ళుగా త్యాగయ్యగారి చిత్ర పటాన్ని తమ పూజా మందిరంలో ఉంచి ఆరాధిస్తూ వున్నారు. ఆ చిత్తరువే పోస్టల్ స్టాంపుగా విడుదలఅయింది.

ఉమయాల్పురం సోదరుల వద్ద సంగీత శిక్షణ గడిపిన మరో విద్వాంసుడు ఉమయాల్పురం స్వామినాథయ్యర్. మహా వైద్యనాథయ్యర్ ఈయన శిష్యుడే. మహా రాజపురం విశ్వనాథయ్యర్ (సెమ్మంగుడి శ్రీనివాస య్యర్ గురువు) స్వామినాథయ్యర్ శిష్యుడే. గురు శిష్య పరంపర పెరిగిన కొద్దీ సాంప్రదాయ సంగీతం వృద్ధి చెందుతూ వుంటుంది అనడానికి త్యాగరాజు ని శిష్యులే సాక్ష్యులు.

కొన్ని త్యాగరాజ కీర్తనలు ఆయన శిష్యుల కుటుంబాల లోని వారే పాడుకొని ప్రచారం చేశారు. అందులో సుందర, కృష్ణభాగవతార్ సోదరు లే ఇంచు మించు 350 కీర్తనలు కట్టుదిట్టంగా బోధించి విస్తృతప్రచారం కావడానికి దోహదపడ్డారు. అఠాణా రాగంలో 'బాల కనకమయ చేల', హుసేని రాగంలో 'రామా నిన్నే నమ్మినాను', మాయామాళవగౌళ లో 'మేరు సమాన', బిలహరి రాగంలో ' దొరకునా ఇటువంటి సేవ ', ముఖారి లో 'క్షీణమై తిరుగజన్మించే',సారమతి లో 'మోక్షము గలదా'!, సామ రాగంలో 'శాంత ము లేక సౌఖ్యము లేదు ' మొదలైన శిఖరాయ మైన త్యాగరాయ కీర్తనలు ఉమయాల్పురం సోదరులు పాడగా ప్రసిద్ధి చెందిన కీర్తన పాఠాన్నే నేటికీ విద్వాంసులు యథాతథంగా కచేరీలలో గానం చేయడం గమనార్హం.

**తరచుగా శిష్యులు**

గురువుల్ని మారుస్తూ పోతే సంగీత జ్ఞానంపెరగడం, సంగతటుంచి సంగీతం పై సదవగాహన ఏర్పడదు. నేర్చుకొనే వారికి నేర్పే వారి సమర్థత పూర్తిగా తెలియదు. నేర్చుకోమని ప్రోద్బలం చేసే తల్లిదండ్రులు సద్గురువును గుర్తించ లేరు. పాడ గలిగే గాయకులందరూ విద్వాంసులు కాక పోవచ్చు. విద్వాంసులందరికీ కూర్చో బెట్టి పాఠం చెప్పే సమర్థత వుండక పోవచ్చు. పరిణతి చెందిన జ్ఞానం కలిగి లక్ష్య లక్షణం తెలిసిన గురువులు మాత్రమే సరియైన దోవలో మార్గ దర్శనం చేయగలరు. తక్కిన వారు సంగీతం పై అభిరుచి కలిగించే ప్రయత్నం మాత్రం చేస్తారు.

ఒకటికి పదిసార్లు పాడితే సినిమా పాటలు లొంగవచ్చునేమో ?

సంప్రదాయ సంగీతం, రాగ భావం నిండిన కీర్తనలు మాత్రం, అలా వినేసి ఇలా పాడగలిగేది కాదు. ఉద్ధరేదాత్మ నాత్మానం.స్వయంకృషి శ్రద్ధ, భక్తి, పట్టుదల సంగీతానికి మూల స్తంభాలు, అవే పెట్టుబడులు.వేరే దగ్గర దారులంటూ లేవు.

# శ్రీరంగనాథునికి ప్రియభక్త వాగ్గేయకారులు
# అల్లూరి వెంకటాద్రిస్వామి



– ఆకొండి శ్రీనివాసరాజారావు
సెల్ : 9441238911



అది ఆంధ్రప్రదేశ్ లో కృష్ణాజిల్లాలో కంచికిచెర్లకు సమీపంగా ఉన్న అల్లూరు గ్రామం. ఆ గ్రామంలో లక్ష్మీనరసింహ స్వామి ఆలయం ఉంది. ఒకరోజున పరమభాగవతోత్తములు, వాగ్గేయకారులు అయిన తూము నరసింహదాసు, నరసింహస్వామి దర్శనం కోసం విచ్చేసారు. ఆ ఆలయంలో ఎంతో భక్తితో, శ్రద్ధతో, కమ్మని కంఠంతో భజనచేస్తున్న ఒక బాలుని చూసారు. ఆ బాలుని గళంనుండి వెలువడే ఆ కీర్తనలకు, ఆ బాలుని భక్తి శ్రద్ధలకు నరసింహదాసు ఎంతో ముగ్ధులయ్యారు. భజన పూర్తి అయ్యాక, ఆ బాలుని పిలచి అతనిని ఆశీర్వదించి, తాను ఉపయోగిస్తున్న తంబూర, కరతాళములు, గజ్జెలు ఆ బాలునకు ఇచ్చి, తారకమంత్రోపదేశం చేసారు. చిరుతప్రాయంలోనే భక్తి, వైరాగ్యాలు కలిగి, నరసింహదాసువంటి భక్తాగ్రేసరుని ఆశీస్సులను అందుకొన్న బాలుడే అల్లూరి వెంకటాద్రి స్వామి. ఈ సంఘటన జరిగినది 14-7-1818న.

వెంకటాద్రి స్వామి 23-3-1807 లో ఆర్వేల నియోగి బ్రాహ్మణ కుటుంబంలో, వెంకయ్య, వెంకమ్మ అనే పుణ్యదంపతులకు అల్లూరులో జన్మించారు. వెంకటాద్రికి ఐదవ ఏట అక్షరాభ్యాసం, ఉపనయనం జరిపించారు. ఎంతో శ్రద్ధగా విద్యాభ్యాసం చేసేవారు వెంకటాద్రి.

ఒక రోజున వెంకటాద్రి తనకు తెలిసిన కొందరు గోవులను మేపే పిల్లలతో కలసి అడవికి వెళ్ళారు. ఆవు దూడలతో ఆటలాడిన చిన్నారి వెంకటాద్రికి అలసట వచ్చింది. ఒక చిన్న పొద నీడన నిద్రించసాగారు. అలా నిద్రిస్తున్న వెంకటాద్రి ముఖంపైన చెట్టు కొమ్మల సందునుంచి

ఎండపడుతోంది. అప్పుడు ఎక్కడనుంచో ఒక పెద్ద నల్లత్రాచు వచ్చి వెంకటాద్రి ముఖంపై ఎండ పడకుండా తన పడగతో గొడుగులా పట్టింది. అది గమనించిన పశువుల కాపరులు ఆశ్చర్యపోయారు. వెంకటాద్రి చాలా గొప్పవాడు కాగలడని వారు తలచారు. నిద్రిస్తున్న వెంకటాద్రికి ఈ విషయం తెలియదు. వెంకటాద్రికి ఒక కలవచ్చింది. కలలో విల్లమ్ములు ధరించిన ఇద్దరు అన్నదమ్ములు ఒక స్త్రీ, ఒక వానరం కనిపించారు. అన్నగారి అనుమతితో తమ్ముడు వెంకటాద్రి నాలుకపైన బీజాక్షరాలను లిఖించాడు. కలలో కనిపించినది సీతా, రామ, లక్ష్మణ,హనుమలని వెంకటాద్రికి అవగతమయ్యింది. ఆనాటి నుంచి వెంకటాద్రి నడతలో మార్పువచ్చింది. భక్తి పెరిగింది. ఆ ఊరిలో ఉన్న నరసింహ క్షేత్రంలో పుష్పకైంకర్యం, భక్తితో సంకీర్తన సేవ చేసేవారు. అలా సేవచేస్తున్నప్పుడే తూము నరసింహదాసు వారు రావడం, తారకమంత్రోపదేశం చేయడం గురించి మనం ముందు తెలుసుకొన్నాం.

వెంకటాద్రికి బీజాక్షరాలను ఆ లక్ష్మణస్వామే వ్రాసారు. అలాగే రామతారక మంత్రోపదేశం నరసింహదాసు చేసారు. ఇంక ఇంత కన్నా కావలసినది ఏముంది? వెంకటాద్రి నిరంతరం తారకమంత్రాన్ని జపిస్తూ, కీర్తనలు రచించి గానం చేస్తూ ఉండేవారు.

ఇలా ఉండగా 29-11-820 లో అంటే తన పదమూడవ ఏట తల్లి తండ్రులకు చెప్పకుండా భద్రాచలం వెళ్ళారు వెంకటాద్రి. అక్కడ రామునిపై కీర్తనలు రచించి, పాడుతూ, రామకోటి వ్రాస్తూ ఐదు సంవత్సరాలు గడిపారు.

కొంతమంది యాత్రికులు కాంచీపురం వెళుతున్నారు. వెంకటాద్రికి ఆయాత్రికులతో కంచివెళ్ళి, అక్కడ జరిగే గరుడోత్సవాన్ని తిలకించాలనే కోరిక కలిగింది. ఆ యాత్రికులతో పాటు కాంచీపురం బయలుదేరారు. దారిలో తిరుమలలో ఆగారు. వేంకటేశ్వరుని తన కీర్తనల సుమాలతో అర్చించారు. 'శేషాచలవాస శ్రీశ్రీనివాస' ఆనందభైరవి రాగంలో, అలాగే అఠాణా రాగంలో 'పంకేరుహనయన', జంఝూటిలో 'చలమేలజేసేవుర సామి' వంటి కీర్తనలు తిరుమలలో రచించారు.

తిరుమలనుంచి ప్రయాణించి కంచి చేరారు. వరదరాజస్వామిని, ఆయన దేవేరి పేరుందేవిని దర్శించి, ఆనంద భరితులయ్యారు. కంచిలోనే నివాసం ఉండాలని నిర్ణయించుకొన్నారు. స్వామి వారి పుష్కరిణికి పశ్చిమంగా ఉన్న ఒక చిన్న మండపమే వెంకటాద్రి నివాసం. ప్రతినిత్యం స్వామివారికి సేవలు చేయడం, స్వయంగా కీర్తనలు రచించి గానం చేయడం చేసేవారు. ఆకలిబాధ తీర్చుకోవడానికి మధుకరవృత్తిని ఆశ్రయించారు. అప్పటికి వెంకటాద్రి వయస్సు కేవలం ఇరవై సంవత్సరాలు మాత్రమే. అంత చిన్న వయస్సులోనే ఎంతో వైరాగ్యాన్ని, ఆధ్యాత్మిక సంపదను కలిగిన వెంకటాద్రి ఎంతో ధన్యులు.

వరదరాజస్వామికి ప్రతీరోజూ పుష్పకైంకర్యం చేయాలని నిశ్చయించుకొన్నారు వెంకటాద్రి. రెండు పూలతోటలను పెంచారు. ప్రతీరోజూ పూలను కోసి మాలలు కట్టి వరదరాజస్వామికి, పేరుందేవికి

సమర్పించేవారు.

ఒక రోజు వెంకటాద్రి తోటలో పూవులు కోస్తుండగా ఒక నల్లత్రాచు ఆయనను కాటువేసింది. అది చూసిన కొందరు వెంకటాద్రికి చికిత్స చేయడానికి ప్రయత్నించగా ఆయన వారించి విష్ణుమూర్తి పానుపు నన్నేమీ చేయదని తెలిపి వరదరాజస్వామి ఎదుట కీర్తనలు పాడుతూ నృత్యం చేసారు. శరీరం అంతా బాగా చెమట పట్టింది. ఆ విషయం అంతా చెమట ద్వారా బయటకు పోయింది. ఈ విషయం కాంచీపురంలోనూ, చుట్టు ప్రక్కల ఉన్న పల్లెటూర్లలోనూ తెలిసింది. వెంకటాద్రి ఎంతో గొప్ప భక్తులు అని అర్థం అయ్యింది. ఎందరో ఆయనకు శిష్యులయ్యారు. ఆయన చేసే వివిధ భగవత్ కైంకర్యాలలో అందరూ ఎంతో ఉత్సాహంగా పాల్గొనేవారు.

వెంకటాద్రి కంచిలో ఎన్నో కీర్తనలు రచించారు. భైరవిరాగంలో 'ప్రొద్దుప్రొద్దున లేచి పొడగంటి వరదుని ముద్దుల మోమునేడు', ఆనందభైరవిలో 'కరిరాజ వరదుడు మము గన్నవాడు, 'కరిరాజ వరదుని పాదకమలములు' వంటివి కొన్ని.

కంచిలో ఒక విష్ణాలయం బాగా శిథిలమైపోయింది. దానిని పునరుద్ధరించాలని సంకల్పించారు వెంకటాద్రి స్వామి. ఊరూరూ తిరుగుతూ ఆలయ పునరుద్ధరణ కోసం చందాలను పోగుచేసారు. ఆ ఆలయాన్ని బాగుచేయించారు. అంతేకాదు నిత్యారాధన సక్రమంగా జరిగేందుకు కొంత పొలాన్ని కూడా ఆలయం కోసం కోన్నారు.

కాంచీ పురంలో విద్యార్థులకోసం ఒక వేద పాఠశాలను నిర్మించి, వేదాచార్యునికి జీతం, పిల్లలకు భోజన, వసతి ఏర్పాట్లు శాశ్వతంగా చేసారు.

వెంకటాద్రి ఈ విధంగా ఎన్నెన్నో సేవలు చేస్తూ, మహా భక్తునిగా పేరుగాంచడం కొందరికి అసూయకలిగించింది. ఈ అసూయాపరులు ఒక వేశ్యను ఆయన దగ్గరకు పంపి, ఆయన బ్రహ్మచర్యాన్ని పాడుచేయమన్నారు. ఆ వేశ్య ఎంతో ప్రయత్నించి విఫలం అయ్యింది. ఈ విషయాన్ని తనను పంపిన వారికి తెలిపింది. వారంతా వెంకటాద్రి గొప్పదనాన్ని గ్రహించి, తాము చేసిన పనికి చింతించారు. వెంకటాద్రిని క్షమించమనికోరారు.

ఒక రోజు వెంకటాద్రికి కలలో వరదరాజస్వామి కనిపించారు. తనకు ఒక కిరీటాన్ని చేయించమని ఆజ్ఞాపించారు. కిరీటాన్ని చేయించడానికి విరాళాలను సేకరించాలని వెంకటాద్రి నిశ్చయించారు. మద్రాసు (ఇప్పటి చెన్నై) వెళ్ళి, భగవంతుని కథలను చెబుతూ కీర్తనలు పాడుతూ, భజనలు చేస్తూ విరాళాలను సేకరించేవారు. రోజుకు కనీసం పదిరూపాయల సేకరిస్తేనేగాని అన్నం, నీళ్లు తీసుకోకూడదనే నియమం పెట్టుకొన్నారు. ఆ రోజులలో పదిరూపాయలు అంటే చాలా ఎక్కువే. పసుపులేటి రామానుజులనాయుడు, షరీపు వెంకటస్వామినాయుడు, రొట్టెల మనవాళనాయుడు, శెవ్వాపేట అప్పాస్వామి రాజు, మాంబళం మణవాలదాసు, వాయలూరు శ్రీనివాస పిళ్ళై, చంద్రగిరి యతిరాజులు నాయుడు, కల్లెపల్లె నరసయ్య, గంటా రామానుజులు సెట్టి, రాఘవులు నాయుడు, రంగయ్యనాయుడు, గోలుకొండ రామానుజయ్య మొదలైన భక్తులు వెంకటాద్రితో

కలసి ఈ విరాళాల సేకరణకు సహకరించారు. మొత్తం 20,000 రూపాయలు సేకరించి, దానితో కిరీటం చేయించారు. ఈ కిరీటాన్ని చెన్నైలో ఊరేగించి, కాంచీపురం తీసుకొని వెళ్ళి, అక్కడకూడా ఊరేగించి స్వామివారికి అర్పించారు. ఈ విధంగా ఈ కిరీటాన్ని సమర్పించినది 1858 లో అని తెలుస్తోంది.

మరొకసారి వరదరాజస్వామి దేవేరులు కలలో కనిపించి తండ్రికి కిరీటం చేయించావు మా మాట మరచిపోయావా? మా ఎడ ప్రీతిలేదా?' అని అడిగారు. మరలా వెంకటాద్రి చెన్నై చేరి అక్కడ కృష్ణమనాయని అగ్రహారంలో ఉంటూ, మధుకరవృత్తి చేసి తన ఆహారాన్ని సంపాదించుకొని, భక్తులనుండి విరాళాలు సేకరిస్తూ ఉండేవారు. తాను మధుకర వృత్తి చేసి తెచ్చిన ఆహారాన్ని తాను నిత్యం ఆరాధించే శ్రీనివాసుని విగ్రహానికి నివేదన చేసి, తరువాత వాటిని ఆరగించేవారు. ఒకనాడు ఆహారాన్ని వెంకటాద్రి విగ్రహానికి నివేదించగా ఆ విగ్రహం తలతిప్పుకొందట. వెంకటాద్రి ఇలా ఎందుకు జరిగింది? అని ఆలోచించి, ఆ ఆహారాన్ని పరిశీలిస్తే అందులో ఒక తేలు చచ్చిపడి ఉంది. అప్పుడు ఆ ఆహార పదార్థాలను పారవేసి, పాలు, పండ్లు నివేదన చేయగా విగ్రహం మామూలుగా అయ్యిందట. అది చూసిన వారందరూ వెంకటాద్రి మహా భక్తులు అని గ్రహించి వారి అడుగుజాడలలో నడవసాగారు. అమ్మవార్లకు కిరీటాలు చేయించి, వాటిని కంచికి చేర్చి అమ్మవార్లకు 1862 వ సంవత్సరంలో సమర్పించారు.

వెంకటాద్రి అళగియ మణవాల జియ్యర్ స్వామి వద్ద వైష్ణవ దీక్ష తీసుకొన్నారు. వారి శిష్యరికం చేసారు.

ఒకనాటి రాత్రి నిద్రిస్తున్న వెంకటాద్రి కలలో శ్రీ రంగనాథుడు కనిపించి, ఒక కిరీటాన్ని తయారు చేయించి తనకు సమర్పించమని కోరారు. శ్రీరంగనాథునికి సేవచేసే భాగ్యం కలిగిందని వెంకటాద్రి ఎంతో సంతోషించి, యథాప్రకారం మద్రాసుకు వెళ్ళి భజనలు చేస్తూ విరాళాలను సేకరించసాగారు. మాంబళం ఆదినారాయణదాసు, అన్నలూరి నారాయణదాసు, కట్టా రామదాసు, కళ్ళేపల్లి నరసయ్యదాసు, దేవేంద్రపురం నారాయణ దాసు, గండి ఆదినారాయణదాసు, పుష్పాల రామదాసు, ఘంటా రామానుజదాసు అనే ఎనిమిదిమంది శిష్యులు విరాళాలు సేకరించడానికి వెంకటాద్రికి సహకరించారు.

వెంకటాద్రి విరాళాలు సేకరించి, కిరీటాన్ని చేయించారు. అయితే కిరీటంలో మణులు ఇంకా పొదగవలసి ఉంది. ఇంతలో వెంకటాద్రికి ఒక సందేహం వచ్చింది. శ్రీరంగనాథుని దర్శించకుండానే కిరీటం చేయించానే, ఇది స్వామికి సరిపోతుందో లేదో అనేదే ఆ సందేహం. అయితే ముందుగా శ్రీరంగం వెళ్ళి ఈ కిరీటం సరిపోతుందోలేదో చూసుకొని, తరువాత మణులతో ఈ కిరీటాన్ని అలంకరింపచేయవచ్చునని భావించారు. కిరీటాన్ని తీసుకొని కాలినడకన శ్రీరంగం బయలుదేరారు. దారిలో 'లాల్ గుడి' అనే ఊరు చేరారు. ఇక్కడ దొంగలభయం ఎక్కువ. ఈ ఊరులో ఒక సత్రంలో విశ్రమించారు వెంకటాద్రి. అర్ధరాత్రి దొంగలు వచ్చారు. వెంకటాద్రి దగ్గర

గల కిరీటాన్ని దోచుకోవాలని అనుకొన్నారు. సత్రంలోనికి రాళ్ళు విసరసాగారు. వెంకటాద్రి దొంగలను చూసి దుఃఖించి, ఇది రంగనిసొత్తు దానిని ఆయనే కాపాడుకొంటాడు అని భావించి, రంగనాథుని ధ్యానిస్తూ ఉన్నారు. ఇంతలో ఒక రాజు తన భటులతో అక్కడకు వచ్చారు. రాజును చూసి దొంగలు భయంతో పారిపోయారు. రాజు మరలా దొంగలు రాకుండా అక్కడ తన భటులను కాపలా పెట్టారు. వెంకటాద్రి ప్రశాంతంగా నిద్రించారు. తెల్లవారింది. రాత్రి జరిగిన సంఘటన గురించి అక్కడవారితో చెప్పారు వెంకటాద్రి. వారంతా ఆశ్చర్యపోయి, 'అటువంటి రాజు ఈ ప్రాంతంలో ఎవరూ లేరే' అన్నారు. తనను కాపాడడానికి వచ్చినది ఆ రంగడే అని గ్రహించి 'అయ్యో! నన్ను రక్షించడానికి వచ్చిన రంగని పాదాలు పట్టుకోలేక పోయానే' అని చింతించారు. ఆ ఊరివారు కూడా వెంకటాద్రికి కిరీటం కోసం విరాళం ఇచ్చారు. వెంకటాద్రి ఆ విరాళాన్ని స్వీకరించి తన ప్రయాణాన్ని కొనసాగించారు.

శ్రీరంగం ప్రయాణం సాగిస్తున్న వెంకటాద్రికి ఒకరోజు తినడానికి ఏమీ లభించలేదు. అలా ఏమీ తినకుండానే ఒక కొలను ఒడ్డున విశ్రమించారు. ఇంతలో కొందరు బాటసారులు వచ్చి, వెంకటాద్రి పరిస్థితిని గమనించారు. 'ఇక్కడకు దగ్గరలో ఒక గ్రామం ఉంది. అక్కడకు వెళ్ళి మీ ఆకలి బాధను తీర్చుకోండి' అని బాటసారులు వెంకటాద్రికి చెప్పారు. వెంకటాద్రి అతి కష్టంమీద లేచి, ఆ గ్రామం దిశగా నడక సాగించారు. కానీ బలహీనంగా ఉండడం చేత కొంతదూరం నడచి కూలబడిపోయారు. పరిశీలించి చూస్తే చాలా దగ్గరలోనే ఒక గ్రామం కనిపించింది. ఎలాగో ఓపిక తెచ్చుకొని ఆ గ్రామం చేరారు. ఆ గ్రామస్తులు వెంకటాద్రిని ఆదరించి, ఆహారం ఇచ్చారు. వెంకటాద్రి భోజనం చేసి, తిరిగి తాను ఇంతకు ముందు నిద్రించిన కొలను దగ్గరకు వచ్చారు. వెంకటాద్రికి ఆ గ్రామం వెళ్ళమని సలహా చెప్పిన బాటసారులు 'అదేమిటి? ఆ గ్రామానికి అంత త్వరగా వెళ్ళి వచ్చేశారు? అంత త్వరగా వెళ్లి రావడానికి వీలుకాదే?' అని ఆశ్చర్యంతో అడిగారు. వెంకటాద్రి తను వెళ్ళి వచ్చిన గ్రామం వివరాలు ఆ బాటసారులకు తెలుపగా, అటువంటి గ్రామం ఏదీ అక్కడ లేదే? బహుశా ఆ రంగడే మీకోసం గ్రామాన్ని సృష్టించారేమో' అని అన్నారు . ఆ మాటలు విన్న వెంకటాద్రి రంగడు తన వెన్నంటి ఉన్నాడని ఎంతో ఆనందించి, ఆనందాశ్రువులు రాల్చారు.

వెంకటాద్రి తన ప్రయాణాన్ని కొనసాగించి, శ్రీరంగం చేరారు. ఆ కిరీటాన్ని రంగనాథుని తలకు అలంకరించగా అది ఖచ్చితంగా సరిపోయింది. ఇది వెంకటాద్రితోపాటు అక్కడ ఉన్నవారందరికీ ఎంతో ఆశ్చర్యం కలిగించింది.

వెంకటాద్రి శ్రీరంగంనుండి తిరిగి చెన్నై చేరారు. విరాళాలు సేకరించి కిరీటంలో మణులు పొదిగించారు. కిరీటం మధ్యలో ఒక పెద్ద పచ్చను పొదిగించాలని భావించారు వెంకటాద్రి. అయితే దానికి సరిపడే పచ్చ ఎక్కడా దొరకడం లేదు. దానికోసం గాలిస్తుండగా, ఒకరోజున, వెంకటాద్రికి శ్రీరంగనాథుడు కలలో కనిపించి, "పచ్చకోసం చింతించకు బెంగాల్ లో మాధవదాసు అనే వ్యక్తి దగ్గర ఇనుపపెట్టెలో ఒక రహస్యమైన అర ఉంది. ఆ

అరలో మాధవదాసు పూర్వీకులు ఒక మణిని దాచి ఉంచారు. ఈ విషయం మాధవదాసుకు కూడా తెలియదు. ఆ మణిని తెప్పించు" అని తెలిపాడు. వెంకటాద్రి కొందరు వదాన్యులకు ఈ విషయం చెప్పి బెంగాల్ పంపారు. వారు బెంగాల్ చేరి మాధవదాసుకు ఈ విషయం చెప్పగా, మాధవదాసు ఎంతో ఆశ్చర్యపోయాడు. ఆనందంగా ఆ పచ్చను సమర్పించాడు. పచ్చతో ఆ వదాన్యులు మద్రాసు చేరారు.

ఆ పచ్చను కిరీటం చేస్తున్న ఆయనకు ఇచ్చి కిరీటంలో అతకమన్నారు. అంత అపురూపమైన పచ్చను చూసేసరికి అతనికి దుర్బుద్ధి పుట్టింది. దానిని అపహరించాలని తలపోశాడు. తన ఇంటి చూరులో ఆపచ్చను దాచిపెట్టి, అలాంటిదే ఒక నకిలీ పచ్చను కిరీటంలో బిగించడానికి ప్రయత్నించాడు. అయితే రంగనాథుడు వెంకటాద్రి కలలో కనిపించి ఈ విషయాన్ని తెలిపాడు. వెంకటాద్రి కొందరు భక్తులతో కలసి అతని దగ్గరకు వెళ్ళి పచ్చను ఇమ్మని అడుగగా, నకిలీ పచ్చను చూపించాడు. వెంకటాద్రి చూరులోంచి అసలు పచ్చను తీయగా, అతను భయపడి, క్షమాభిక్ష కోరాడు. భక్తులు అతనిని రక్షకభటులకు అప్పగించుదాం అనగా, వెంకటాద్రి అతనిని క్షమించి వదిలివేసారు. ఇంకొకరితో పనిని పూర్తిచేయించి కిరీటాన్ని శ్రీరంగం తీసుకొని వెళ్ళి స్వామికి సమర్పించారు. ఇలా శ్రీరంగనాధునికి కిరీటాన్ని సమర్పించిన సంవత్సరం 1863 అని తెలియవస్తోంది. రంగని కీర్తించి, కొన్ని రోజులు అక్కడ ఉండి, రంగనాధుని దేవేరులకు కూడా కిరీటాలను చేయించాలని సంకల్పించి తిరిగి చెన్నై వచ్చారు.

చెన్నైలో విరాళాల సేకరణ ప్రారంభించారు. రోజుకు పది రూపాయలైనా సేకరించకుండా అన్నం, నీళ్ళు తీసుకొనేవారి కాదని మనం ఇంతకు ముందు తెలుసుకొన్నాంకదా! ఒక రోజున ఎంతసేపు తిరిగినా కేవలం ఐదు రూపాయలే దొరికాయి. ఆ రోజున ఎండ ఎక్కువగా ఉంది. ఆ ఎండలోనే అన్నపానీయాలు లేకుండా వెంకటాద్రి తిరుగుతున్నారు. ఇంతలో వెంకటాద్రికి పరిచయం ఉన్న అప్పాస్వామిరాజు అనే వ్యక్తి కనిపించి, వెంకటాద్రికి ఎండతగలకుండా గొడుగుపట్టుకొని కూడా తిరిగాడు. మిగిలిన ఐదు రూపాయలు దొరికాయి. అప్పాస్వామి వెళ్ళిపోయాడు.

ఆ రోజున భజన కార్యక్రమం ఉంది. ఆ కార్యక్రమం వెంకటాద్రికి గొడుగు పట్టిన అప్పాస్వామి రాజు ఇంటిలోనే. వెంకటాద్రి భజన కార్యక్రమం నిమిత్తం అప్పాస్వామి రాజు ఇంటికి వెళ్ళారు. అప్పాస్వామి జ్వరంతో బాధపడుతూ ఐదు రోజులుగా ఇంటినుంచి బయటకు అడుగుపెట్టడంలేదని తెలుసుకొని ఎంతో ఆశ్చర్యపోయారు. తనకు గొడుగు పట్టినది ఆ రంగడేనని గ్రహించి ఆనందాశ్రువులు రాల్చారు. ఈ విషయాన్ని అందరికీ తెలిపారు. వారు ఎంతో గొప్ప భక్తులని వారందరికీ అర్థం అయ్యింది. అందరూ ఎంతో సంతోషించారు.

శ్రీరంగనాధుని దేవేరులిద్దరికీ కిరీటాలు చేయించి సమర్పించారు వెంకటాద్రి. శ్రీరంగంలోనే నివాసం ఉంటూ 'కస్తూరి రంగయ్య కరుణించవయ్యా,

సుస్థిరముగా నమ్మితినయ్య' అనే ఆనందభైరవికీర్తన, జంఝూటి రాగంలో 'మొరఆలకించర మోహనరంగ (నా)' అనే కీర్తన, శంకరాభరణం రాగంలో 'మ్రొక్కెదరారా మోహనరంగా' అనే కీర్తనలు రచించారు వెంకటాద్రి.

'మకరకంఠి' అనే ఒక ఆభరణాన్ని చేయించమని రంగడు, వెంకటాద్రి కలలో కనిపించి చెప్పాడు. 'స్వామీ! నా దేహం పటుత్వం కోల్పోతున్నది. ఈ వయసులో అంతటి దివ్య ఆభరణాన్ని నేను ఎలా చేయించగలను' అని సందేహం వెలిబుచ్చాడు. అందుకు రంగడు 'నీవు నిమిత్తమాత్రంగా ఉండు. అన్నిపనులు సులభంగా జరిగేలా నేను చూస్తాను' అని అభయమిచ్చాడు. రంగడు అభయమిచ్చినట్లుగానే తిరుచిరాపల్లిలో ఉండే 'సీతారాంబైరాగి' అనే వ్యక్తికలలో రంగడు కనిపించి, వెంకటాద్రి మహాకంఠిని తయారు చేయించడానికి పూనుకొన్నాడని, నీవు వెళ్ళి వెయ్యరూపాయలు విరాళం ఇవ్వమని ఆజ్ఞాపించాడు. సీతారాంబైరాగికి వెయ్యిరూపాయలు ఇవ్వడానికి మనస్సు అంగీకరించలేదు. ఐదు వందలు తెచ్చి వెంకటాద్రికి ఇచ్చాడు. తన ఇల్లు చేరాడు. ఆ రోజు రాత్రి కలలో శ్రీరంగనాధుడు మరలా కనపడి 'నేను వెయ్యరూపాయలు ఇవ్వమంటే ఐదువందలే ఎందుకిచ్చావు' అంటూ అడిగి బెత్తంతో గట్టిగా కొట్టాడు. సీతారాం బైరాగి వెంటనే శ్రీరంగం వెళ్ళి వెంకటాద్రికి ఈ విషయం చెప్పి రంగడు కొట్టినందువలన ఏర్పడిన వాతలను చూపి, మిగిలిన ఐదు వందలు ఇచ్చాడు. వెంకటాద్రి ఎంతో ఆనందించాడు. మరలా చెన్నై చేరి విరాళాలను సేకరించి, ఆభరణాన్ని చేయించసాగారు. మైలపూర్ ఆదినారాయణదాసు అనే ప్రియశిష్యుడు వెంకటాద్రికి విరాళాలను సేకరించేందుకు సహకరించారు.

వెంకటాద్రి మకరకంఠిని చేయిస్తూ ఉండగా నెల్లూరులో ఉన్న రంగనాథస్వామి కలలో కనిపించి, 'నా ఆలయం జీర్ణమైపోతున్నదని' అన్నారు. వెంకటాద్రి తన శిష్యులకు, భక్తులకు ఈ విషయం తెలిపి, ఆలయాన్ని పునరుద్ధరణ చేయాలనీ సంకల్పించారు. విరాళాలు సేకరించి తన శిష్యులు ఆదినారాయణ దాసు సహకారంతో నెల్లూరు ఆలయాన్ని పునరుద్ధరణ గావించారు.

అంతేకాదు చెన్నైకు దగ్గరలో ఉన్న 'తిరువడందే' అనే ఊరిలో ఉన్న నిత్యకల్యాణస్వామి కోవెల జీర్ణోద్ధరణ తమ శిష్యులైన దేవేంద్రపురం నారాయణదాసు, కళ్లేపల్లి నరసయ్యల సహాయంతో చేయించారు. ఇంకా మహాబలిపురంలో స్థలశయన పెరుమాళ్ళ ను దర్శించి అక్కడ శిథిలమై ఉన్న వానిని బాగుచేయించారు. తిరిగి చెన్నై వచ్చారు. అక్కడ మాంబళంలో తన శిష్యుడైన పైడి గంటం ఆదినారాయణ దాసు ఇంట భజన నిర్వహించి తను నిత్యం పూజించుకొనే శ్రీనివాసుని విగ్రహాన్ని, సాలగ్రామాన్ని అతనికి ఇచ్చారు. అలాగే మరొక శిష్యుడైన కట్టా రామదాసుకు కూడా మరొక సాలిగ్రామం ఇచ్చారు. నేనింక చెన్నపట్నం రానని శిష్యులకు తెలిపి వరదుని నిరంతరం భజనచేయమన్నారు. తిరిగి శ్రీరంగం వెళ్ళిపోయారు. వెంకటాద్రి చేయించిన మకరకంఠిని 1867 లో శ్రీరంగనాథునికి అలంకరింపచేసి కన్నులారా దర్శించి ఆనందాన్ని పొందారు.

1866 నుంచి 1872 వరకు మద్రాసు గవర్నర్ గా ఉన్న లార్డ్ నేపియర్ ఒక పర్యాయయం శ్రీ రంగనాథునికి గల ఆభరణాలను చూసి ఇవి ఎవరో హిందూ రాజు చేయించి ఉంటారని అర్చకులతో అనగా, అర్చకులు వెంకటాద్రి చేయించారని ఆయనను చూపారు. నేపియర్ ఆశ్చర్యపోయారు. వెంకటాద్రిని 'మీరు జీసస్ క్రైస్తులాగ ఉన్నారు' అన్నారట. దానికి వెంకటాద్రి 'సర్వం విష్ణుమయం' అన్నారట.

వెంకటాద్రి ప్రతినిత్యం శ్రీరంగనాథునికి కావలసిన శ్రీ చందనాన్ని తామే స్వయంగా తీసి సమర్పించేవారు. అలాగే స్వామి వారికి, అమ్మవారికి వడ, అతిరసం (అరిసె) నివేదనకోసం శాశ్వతమైన ఏర్పాట్లు గావించారు.

ఇలా వెంకటాద్రి రంగనాథునికి సేవ చేస్తూండగా, రంగనాయకి వెంకటాద్రి కలలో కనపడి 'రాజముడి' చేయించమని చెప్పింది. ఈ విషయాన్ని భక్తులకు తెలియజేసి ధనం సేకరించి రాజముడి చేయించారు. దానికి రత్నాలను పొదిగించే బాధ్యతను గోవర్ధన రంగాచార్యులు, రాధాకృష్ణులకు అప్పచెప్పారు.

దక్షిణ భారతంలోని దివ్యతిరుపతులను శిష్యులతో కలసి దర్శించి, మదురై చేరారు. ఆ రాత్రి కలలో సుందరరాజస్వామి శిథిలమైన గోపురంలో ఉన్నట్లు దర్శనమిచ్చారు. అప్పుడు మదురైకి దగ్గరగా ఉన్నసుందరరాజస్వామిని దర్శించుకొని, జీర్ణమైన గోపురాన్ని చూసి మదురై వచ్చి, ధనసేకరణ చేసి ఆ గోపురాన్ని బాగుచేయించి, శ్రీరంగం చేరారు.

తన అంతరంగ శిష్యుడైన దేవేంద్రపురం నారాయణదాసుకు తన చిరుతలు, తంబూర, గజ్జెలు, కీర్తన గ్రంథం ఇచ్చి, తిరుమంత్రాన్ని ఉపదేశించారు. 1869 లో శ్రీరంగం నారాయణ జియర్ మఠం కు వెళ్ళి సన్యాసాన్ని స్వీకరించారు. తిరువెంగడం రామానుజ జియర్ అనే యతినామాన్ని స్వీకరించారు.

శరీరం పటుత్వం తప్పినా చందనాన్ని తీసి ఇవ్వడం మానకుండా చేసేవారు. అదేవిధంగా రంగనాయకికి చక్కెర పొంగలి ప్రసాద కైంకర్యం కోసం శాశ్వతమైన ఏర్పాట్లు చేయించారు. రంగాచార్యులకు కబురంపి రాజముడిని తెప్పించి రంగనాయకమ్మకు అలంకరింపచేసారు.

ధాతృసంవత్సరం మాఘ బహుళసప్తమి సోమవారం అనగా 5-2-1877 న తాను తనువును విడచి పెట్టనున్నానని తమ శిష్యులకు శ్రీరంగ ఆలయఅధికారులకు తెలియజేసారు. చెన్నైనుండి భక్తులు, శిష్యులు వచ్చారు. వెంకటాద్రి పద్మాసనం వేసి, అష్టాక్షరీ మంత్రాన్ని జపిస్తూండగా కపాల భేదనం జరిగి ఒక దివ్యజ్యోతి శ్రీరంగనాథునిలో లీనమైపోయింది. వెంకటాద్రి పార్థివ దేహాన్ని పడియత్తురై అనే చోట సమాధి చేసారు. శ్రీరంగం వెళ్ళినవారు వెంకటాద్రి గురించి తెలిసినవారైతే ఆయన సమాధిని కూడా దర్శించుకొంటారు.

వెంకటాద్రిస్వామి శిష్యపరంపర తమిళనాట కొనసాగుతోందని తెలుస్తోంది. పెరుంబూరులో 'అల్లూరి వెంకటాద్రి స్వామి భక్తజన సభ' ఉందిట. 'శ్రీమాన్ అల్లూరి వెంకటాద్రి స్వామి దేవాలయ

భక్తకోటి సంఘం' శ్రీరంగంలో ప్రతీ ఏటా వెంకటాద్రి స్వామి ఆరాధనోత్సవాలు నిర్వహిస్తోంది. చెన్నైలోని మింట్ స్ట్రీట్ లో అల్లూరి వెంకటాద్రిస్వామి మఠం ఉంది.

వెంకటాద్రికి, రంగనాధుడు పలుమార్లు దర్శనమిచ్చి తన సేవకు ఆయనను వినియోగించుకొన్నారంటే వెంకటాద్రి ఎంత గొప్ప భక్తులో మనకు తెలుస్తుంది. ఆయన ఎన్ని మార్లు విరాళాలు అడిగినా ప్రజలు లేదనకుండా ఇచ్చారంటే ఆయన నిజాయితీ పట్ల, నిబద్ధత పట్ల భక్తి పట్ల ప్రజలకు అపరిమితమైన నమ్మకం ఉండడమే కారణం. వారి సంకీర్తనా పద్ధతి ప్రజలను ఎంతగానో ఆకర్షించి ఉంటుంది. అందుచేతనే వెంకటాద్రి విరాళాలను సేకరించి భగవత్ సేవ చేయగలిగారు. రామదాసు ఏ విధంగా గుడి కట్టించి ఆభరణాలు చేయించి ధన్యులయ్యారో అదే విధంగా వెంకటాద్రి పలు ఆలయాలను బాగుచేయించి, ఎన్నెన్నో ఆభరణాలు చేయించి చరితార్థులయ్యారు.

పుష్పాల రామదాసు, ఆర్కాడు బాలరామానుజదాసు, కల్లెపల్లి వరదరామానుజ దాసుడు మొదలైన వారు వెంకటాద్రి జీవితచరిత్రను రచించారు. ప్రస్తుతం ఇంటర్ నెట్ లో వెంకటాద్రి గురించిన కొంత సమాచారం, వారి ఫోటో, వారి సమాధి ఫోటోలు కూడా లభ్యం అవుతున్నాయి.

★వెంకటాద్రి కీర్తనలపై పరిశీలన★ :

వెంకటాద్రి స్వామికీర్తనలు 1888 లో ప్రచురితం అయ్యాయని అందులో 162 కీర్తనలు ఉన్నాయని బాలాంత్రపు రజనీకాంతారావు గారు తమ ఆంధ్ర వాగ్గేయకార చరిత్రలో వ్రాసారు. 1916 లో కూడా వీరి కీర్తనలు ప్రచురితం అయ్యాయి. ఈ పుస్తకంలో రెండు వందలకు పైగా కీర్తనలు ఉన్నాయి. అయితే వీటిలో సదాశివ బ్రహ్మేంద్రస్వామి, ఇంకా ఇతరుల కీర్తనలు కనిపిస్తున్నాయి. వాటిని తొలగిస్తే వెంకటాద్రి కీర్తనలు సుమారు రెండు వందల దాకా ఉండవచ్చును. వెంకటాద్రి తమ రచనలలో ఎటువంటి ముద్రా ఉపయోగించలేదు. అందుచేత ఆయన కీర్తనలను గుర్తించడం కష్టం. ఈ కీర్తనలన్నీ భక్తి ప్రాధాన్యమైనవి. అందరూ కలసి భజనలలో పాడుకొనేందుకు వీలుగా ఉంటాయి. కీర్తనలు సరళమైన తెలుగులోనే ఉన్నాయి. కొన్ని మాత్రం సంస్కృతంలో కూడా ఉన్నాయి. ప్రతీకీర్తనకు పల్లవి, అనుపల్లవి చరణాలు ఉన్నాయి. చరణాల సంఖ్య కొన్ని కీర్తనలలో 3,4,5 కూడా ఉన్నాయి. అయితే చాలా కీర్తనలలో చరణాలు కేవలం రెండు పంక్తులుతో మాత్రమే ఉన్నాయి. కొన్నింటిలో చరణాలలో నాలుగు పంక్తులు కనిపిస్తున్నాయి.

తోడి, కల్యాణి, భైరవి, పంతువరాళి, మోహన, ఖరహరప్రియ, నాట, నీలాంబరి, నాదనామక్రియ, సురటి, కాపీ, సౌరాష్ట్ర, పున్నాగవరాళి, శంకరాభరణం, ముఖారి, ఖమాస్, కేదారగౌళ, జంఝూటి, ద్విజావంతి శ్రీరాగం, మధ్యమావతి, యమునా కల్యాణి, శుద్ధసావేరి, అసావేరి, బేగడ ,మాంజి, మంగళకౌశికి వంటి రాగాలు ఉపయోగించారు.

గతంలో వెంకటాద్రిస్వామి కీర్తనలు వింజమూరి వరదరాజయ్యంగార్ పాడినవి, శ్రీరంగం గోపాల రత్నంగారు పాడినవి రేడియోలో

భక్తిరంజని కార్యక్రమంలో ప్రసారం అయ్యాయి. శ్రీరాగంలో 'పంతము సేయుట బిరుదా' ; బిలహరిలో 'జన్మ సఫలమాయే'; సురటిలో 'అప్రమేయవరద'; శంకరాభరణంలో 'మ్రొక్కెదరారా' కీర్తనలు శ్రీరంగం గోపాలరత్నం గానంచేసినవి వినబడేవి. శ్రీ మొదుమూడి సుధాకర్ కూడా వెంకటాద్రిస్వామి కీర్తనలకు సంగీతం కూర్చారు. ఆకాశవాణి నుంచి ఈ కీర్తనలు ప్రసారం అయ్యాయి.

వెంకటాద్రి కీర్తనలు అంత్యప్రాసలు, వృత్యానుప్రాసలతో మంచి వినసొంపుగా ఉంటాయి.

**వృత్యానుప్రాసలు :**

దేవదేవ!శౌరీ మురహరె దేవదేవ శౌరీ
దేవదేవ సురసేవిత చరణా శ్రీ
దేవి వినుతవసుదేవకుమార శ్రీ

**అంత్యప్రాసలు:**

పంతము సేయుట బిరుదా
ప్రణతార్తిహర వరదా
దశరథ రాజకుమారా
దారుణ వైరివిదారా.....

వెంకటాద్రి స్వామివారి కీర్తనల సాహిత్యాన్ని బట్టి పరిశీలిస్తే తనను రక్షించమని వేడుకొనేవి, కొన్ని జనులకు బోధచేసేవి, మరికొన్ని తనమనసుకు తానే బోధ చేసుకొనేవి, మరికొన్ని మధుర భక్తితో నిండి ఉండేవి, వరదుని వర్ణించేవి, మంగళహారతులు, మేలుకొలుపులు, లాలిపాటలు, హెచ్చరిక తెలిపేవి మొదలైన కీర్తనలు కనిపిస్తున్నాయి.

మధ్యామవతి రాగం కీర్తనలో తనను రక్షించమని ఏ విధంగా వేడుకొన్నారో చూడండి

**ప.** **ఎరుగని వాని వలె నున్నావు**
**నేనెంత వేడిన నేమనవు**

**అ.** **పరగ పరగ వచ్చి పంకేరుహనాభ**
**సరగున బ్రోవవు సావధానమేల॥ ఎరు॥**

**చ.** **పాంచాలి పరులచే బాధలుబడగానె**
**అంచితముగా నీ వక్షయమనలేద॥ఎరు॥**

**చ.** **ఘనుడైన గజరాజు వన చరమునకు వెరవ**
**చనువున నీవతని సంరక్షింపవ॥ ఎరు॥**

**చ.** **బాలుడైన ప్రహ్లాద భాగవతుని**
**జాలగా మన్నించి చేరదియ్యలేదా॥ఎరు॥**

**చ.** **కన్నతండ్రిని విడచి కాననమందున**
**మున్ను ధృవుడు దిరుగ మన్నింపగలేదా॥ఎరు॥**

ద్రౌపదిని, గజేంద్రుని, ప్రహ్లాదుని, ధృవుని గాచిన నీవు నేనెవరో ఎరుగనివానిలా ఉన్నావేమి? తొందరగా నను రక్షించవేమి అని అంటున్నారు.

యమునా కల్యాణి రాగం ,అట తాళంలో శ్రీహరినామస్మరణ సేయుడీ జనులార మీరు' అనే కీర్తన జనులకు హరిని భజించమని బోధచేసేది.

**ప.** **శ్రీహరి నామస్మరణ సేయుడీ జనులార మీరు**
**నరహరి నామస్మరణ సేయుడీనరులార మీరు**
**॥శ్రీహరి॥**

**అ.ప.** **మోహమనే చీకటి నూతిలో పడి**
**మోసపోక ముదమలరగ వేగమె ॥శ్రీహరి॥**

**చ.** **తంబుర తాళముచేత ధరియించి వేడుకమీద**
**గంభీరముగా కాల్యగజ్జలు**

**ఘలుఘలుఘలుఘలుఘల్లని మ్రోయగ**
**॥శ్రీహరి॥**

**చ. కేశవమాధవ గోవిందాయని భాసురముగ పాడుచునాడుచు**
**క్లేశమెల్ల బాసి సంతోషము ముప్పిరిగొనగ**
**॥శ్రీహరి॥**

**చ. కరిభూధర మందిరుడౌ వరదుని చరణ కమలములు సారెకు వేడుచు,**
**పరమభక్తులను గూడివేడుకను భజనచేసి పరవశమును జెందుచు॥ శ్రీహరి॥.**

జనులకు హరినామస్మరణ చేయమని చెప్పి ఏ విధంగా స్మరణ చేయాలో కూడా ఈ కీర్తనలో తెలిపారు. మోహాన్ని చీకటిగా ఉన్న నూతితో పోల్చడం విశేషం. తంబూర, తాళం చేతితో పట్టుకొని, కాళ్ళకు గజ్జెలు కట్టుకొని కేశవా, మాధవా, గోవిందా అంటూ పాడుతూ ఆడుతూ పరమానందం పొందుతూ హరిని స్మరించాలన్నారు. పరమభక్తులైన వారితో కలసి భజన చేయాలన్నారు.

'నరహరి చరణము నమ్మినవారికి నరక భయము లేదెన్నటికి' అంటారు యమునా కల్యాణి రాగం ఆదితాళకీర్తనలో. ఇంకా ఈ కీర్తన అనుపల్లవిలో 'పరమ భాగవతులతో సాంగత్యము పరమ సౌఖ్యము ముమ్మాటికి' అని శంకరాచార్యుల 'సత్సంగత్వే నిస్సంగత్వం' శ్లోకాన్ని జ్ఞప్తికి తెచ్చారు. ఈ విధంగా పలుకీర్తనలలో జనులకు మంచిని బోధించారు వెంకటాద్రి.

ఇంక మానసిక బోధకు సంబంధించిన కీర్తనలు చూద్దాం. 'హరినారాయణ గోవిందాయని స్మరణ సేయవే మనసా' అనే సౌరాష్ట్ర రాగ కీర్తనలో హరిని ఎలా భజన చేయాలో తన మనసుకు తానే చెప్పుకొన్నట్లు జనులకు చెప్పారు.

**చ. ఇతర చింతలన్నియు తొలగించి**
**ఇహ సుఖముల తుచ్ఛమని తలంచి**

మన మనసులో హరిపైన చింత తప్ప వేరే ఆలోచనలను తొలగించాలి. ఈ ఇహ సుఖాలు నీచమైనవి అని భావించాలి.

ఇంకా ఈ కీర్తనలో దుష్టులైన నరులను వదలి, పరమ భాగవతులను సేవించాలని, అంతా విష్ణుమయం అని భావించాలని తన మనసుకు తానే బోధించుకుంటారు. ఇంకా ధర్మంపట్ల నిశ్చల బుద్ధికలిగి ఉండాలని, దయ, శాంతి ఇవే సత్యం అని భావించాలని చెప్పారు. 'కర్మఫలము రాముని కర్పించి' అంటూ భగవద్గీతలో శ్రీకృష్ణపరమాత్మ చెప్పిన విషయాన్ని చెప్పారు.

జంఝూటిరాగ కీర్తన 'ఇటువేగరార తాళజాల వేణుగోపాల' ను గమనిస్తే కొంత జావళిని పోలి ఉంటుంది.

**అ. మటుమాయకాడ నీపై మరులు జెందినానురా**

**చ. మోహనాంగ నాతో నింతమోడి జేసేవదేర, నీ స్నేహమిట్టిదాయ సురరాజ సేవిత సుచరణ.**

'సుందరరాజును జూచిన కన్నులజూడ మరెవ్వరినీ' అనే కాంభోజి రాగ కీర్తన చరణంలో హరిని ఎంతో మనోహరంగా వర్ణించారు చూడండి.

'ముద్దు పదములందు మువ్వలు కదలగ

దిద్దిన కస్తూరి తిలకము జారగ

నిద్ధింపు చెక్కిళ్ళు నిగనిగమని మెరయగా....

ఆనందభైరవి రాగంలో 'లాలి సౌందర్య రాజా' అనే కీర్తనలో లాలి ఊగుతున్న విష్ణువుని ఎంతో మనోహరంగా వర్ణించారు. ఈ వర్ణనల బట్టి ఒక చక్కని చిత్రము గీయవచ్చు.

వెంకటాద్రి కీర్తనలలో నవవిధ భక్తి మార్గాలకు సంబంధించిన భావాలు గోచరిస్తాయి. వాటిని ఒకసారి పరిశీలిద్దాం.

**స్మరణం :** సౌరాష్ట్ర రాగంలో చాపుతాళంలోని కీర్తన 'హరినారాయణ గోవిందాయని స్మరణ సేయవే మనసా' అనే కీర్తన స్మరణం కు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. అలాగే యమునా కల్యాణిలో 'శ్రీహరినామస్మరణ' సేయుడీ జనులార మీరు' అనే కీర్తనలో కూడా స్మరణం గూర్చి చెప్పారు.

**కీర్తనం:** 'తెలియని వాడనురా' అనే సురటి రాగం, ఆదితాళం కీర్తనలో 'నీనామ సంకీర్తనము నిత్యమింపొంద గాన రూపము చేత గణుతించు మార్గము' అంటారు.

**పాదసేవనం :** యమునా కల్యాణి రాగంలో 'జగదీశుని చరణార విందములను ధ్యానింపవె మనసా'

**అర్చనం :** 'మేలుకో శ్రీరంగనాథ దయానిధే' అంటూ మేలుకొలుపులు రచించారు. 'జోజోజోజో రాజాధిరాజా' అంటూ జోలపాటలు,

'లాలి బాలముకుంద లాలిగోవిందా' అంటూ లాలి పాటలు,

'హెచ్చరికై యుండుడి దిక్పతులార' అంటూ హెచ్చరిక తెలిపే కీర్తనలు రచించారు.

**దాస్యం :** హుసేని రాగంలో 'శ్రీవల్లభ' అనే కీర్తన చరణంలో

'సేవకుడను బ్రోవరా

వరవసుచేల కరుణాలవాల జాగేల' అంటారు.

ఇంకా పున్నాగవరాళి రాగ కీర్తన 'వరదా నను బ్రోవవే' చరణంలో

'కంటగింపకుమయ్య అయ్యా నీబంటు నేనయ్య' అంటూ దాస్యభావాన్ని వ్యక్తపరిచారు.

**ఆత్మనివేదన :** సురటిరాగంలో అప్రమేయ వరద అనే కీర్తనలలో 'లోకనాథ పరులవేడలేక నీకే శరణంటిని' అంటారు.

ద్విజావంతి రాగ కీర్తన 'రాక ఇంతపరాకు' లో 'నిన్నుగాని నేనన్యమెరుగను' అంటారు.

వెంకటాద్రి కీర్తనలలో రామానుజాచార్యుల వారిపై రచించిన కీర్తన కూడా కనిపిస్తుంది యమునా కల్యాణి రాగం ఆదితాళంలో

ప. **యతిరాజచంద్ర నన్నేలరావయ్య**

చ. **ఎలమిగోపురముపై నెక్కి తిరుమంత్రము**
**ఇలను వెదచల్లిన మా అప్పరావయ్యా...**

అలాగే రామానుజాచార్యులపై మంగళం కీర్తన కూడా ఉంది.

**యదుకుల కాంభోజి – ఆది తాళం**

ప. **రామానుజాచార్యయతిరాజ మంగళం**

**చ. శేషావతారా యతివేషా మంగళం**

ఈ కీర్తన ఇలా సాగుతుంది.

వెంకటాద్రి కీర్తనలలో క్షేత్రముద్రలు కూడా కనిపిస్తున్నాయి. భద్రాచలం, కంచి, శ్రీరంగం, తిరుమల వంటి క్షేత్రాలలో రచించిన కీర్తనలు దీనికి ఉదాహరణ.

**వెంకటాద్రిపై ఇతర వాగ్గేయకారుల ప్రభావం :**

వెంకటాద్రిపై రామదాసు, త్యాగయ్య ప్రభావం కనిపిస్తోంది..

రామదాసు వాడిని 'గొబ్బున' అనే పదాన్ని వెంకటాద్రి కూడా పలుసార్లు వాడారు. రామదాసు 'ఖరాది దైత్య కాంతార కుఠార' అని ప్రయోగిస్తే, వెంకటాద్రి 'పాతకారణ్య కుఠార' అంటారు. రామదాసు 'కోదండరాములు మముగన్నవారు' అంటే, వెంకటాద్రి 'కరిరాజ వరదుడు మమ్ములగన్నవాడు' అన్నారు. 'కమల నయనవాసుదేవ కలివరద మాంపాహి' అని రామదాసు వారు ప్రయోగిస్తే, 'కమల నయన వాసుదేవ కరుణరాద నామీద' అంటారు వెంకటాద్రి. రామదాసులా, వెంకటాద్రి కూడా శబ్దాలంకారాలు ఎక్కువగా ఉపయోగించారు. వెంకటాద్రి ఇంచుమించుగా అన్ని కీర్తనలలో ,చరణాలలో రెండే పంక్తులు ఉంటాయి. రామదాసు కీర్తనలలో కూడా ఇలాంటివి కనిపిస్తాయి.

త్యాగయ్య 'చక్కని రాజమార్గం' అంటే వెంకటాద్రి 'చక్కని మార్గం' అన్నారు. 'చుక్కల రాయని' అనే పదప్రయోగాన్ని త్యాగయ్య, వెంకటాద్రి కూడా చేసారు త్యాగయ్య 'నిన్నే నెరనమ్మినానురా ఓ రామా రామయ్య' అంటే వెంకటాద్రి 'నిన్నే నెర నమ్మినానురా శ్రీరాజదేవ' అంటారు. ఈ విధంగా త్యాగయ్య ప్రభావం వెంకటాద్రిపై కనిపిస్తోంది.

'కస్తూరి రంగయ్య కరుణించవేమయ్య సుస్థిరముగ నమ్మితి నయ్య' అనే కీర్తనను వెంకటాద్రి ఆనందభైరవిలో రచించారు. ఇదే పల్లవి కొద్ది మార్పుతో 'కస్తూరి రంగయ్య కరుణించవేమయ్య సుస్థిరముగ నిన్ను నమ్మితినయ్య' అనే పల్లవితో 'అహనా పెళ్ళంట' చిత్రంలో ఒక పాట కనిపిస్తోంది. అంటే సినీగేయ రచయితలపై వెంకటాద్రి ప్రభావం ఉందన్నమాట. అలాగే 'శేషాచలవాస శ్రీ శ్రీనివాసా' అనే వెంకటాద్రి కీర్తన పల్లవి కూడా కొంతరూపం మార్చుకొని 'శేషశైలవాస శ్రీవేంకటేశ' అంటూ సినిమాపాటగా కనిపిస్తోంది.

వెంకటాద్రి వైరాగ్య శిఖరాలను అందుకొన్న మహాభక్త వాగ్గేయకారులు. పదమూడు సంవత్సరాల పిన్నవయసులోనే భగవంతుని సేవకై ఇల్లు విడచిపెట్టడం దీనికి తార్కాణం. ఇటువంటి భక్త వాగ్గేయకారుని రచనలు భద్రపరచడం, వాటిని వినడం, గానం చేయగలిగినవారు గానం చేయడం వారికి నిజమైన నివాళి కాగలదు.

**రిఫరెన్స్:** 1. శ్రీ అల్లూరి వెంకటాద్రిస్వామి కీర్తనలు.

2. ఆంధ్రవాగ్గేయకార చరిత్రము-శ్రీ బాలాంత్రపు రజనీకాంతరావు.

3. ఆంధ్రయోగులు- శ్రీ బిరుదు రామరాజు.

సుధా తరంగమ్

# నా సంగీతానుభవాలు



- మోదుమూడి సుధాకర్
9885183988. విజయవాడ



'నేను సంగీతరంగంలో ఏ కొంచెమైనా సాధించగలిగాను అంటే..నా చిన్నతనం నుండీ ఎందరో మహానుభావులు నా గానం విని, నాకందించిన ఆశీస్సుల వల్లనే..' అనేవారు మంగళంపల్లి బాలమురళీకృష్ణగారు. నా సంగీతానుభవాలలో నేను విన్నది, మురళీగారు మరచిపోలేనిది ఒక మధుర ఘటన చెప్తాను . అది 30-1-1940 న జరిగింది..

**అది బందరు పట్టణం..**

అనాదిగా సంగీత, సాహిత్యాది విద్యలలో ఎందరో ఉద్దండులకు బందరు ఆయువుపట్టు..త్యాగరాజస్వామి ప్రశిష్యులైన సుసర్ల దక్షిణామూర్తి శాస్త్రులవారు చరించిన నేల..'వాగ్గేయకారరత్న' హరి నాగభూషణం గారు వసించిన తావు..

బెజవాడలో బాలమురళి గానాన్ని అప్పటికే వినియున్న కుర్తాళం పీఠాధిపతులైన శ్రీ శ్రీ శ్రీ విమలానందభారతీ స్వామివారి ఆజ్ఞ మేరకు, బందరులో బాలమురళి గాత్ర కచేరీని "గానవిద్యాభివర్ధని" సభవారు స్థానిక బుట్టాయపేట టౌనుహాలులో ఏర్పాటుచేశారు.

హాలు శ్రోతలతో నిండిపోయింది. ఆ పట్టణ ప్రముఖులైన హరి నాగభూషణం గారు, దాసు గోవిందరావు పంతులుగారు, దాలిపర్తి పిచ్చహరిగారు, కుర్తాళం పీఠాధిపతులు మొదలైన పెద్దలు సభలో ఆసీనులయ్యారు. హరి నాగభూషణంగారు వృత్తిరీత్యా వకీలు అయినప్పటికీ, పరమ నైష్ఠికులు, సంస్కృతాంధ్ర భాషలలోనూ, సంగీతంలోనూ సాటిలేని పండితులు, జంత్రగాత్ర విద్వాంసులు, స్వయంగా వాగ్గేయకారులు.

అటువంటి పెద్దలు ముందు వరుసలో పరివేష్ఠించి ఉండి, పదేళ్ల బాలుడు ఏమి పాడుతాడో చూద్దామని ఎదురుచూడటం విశేషమే!

వేదికపై మురళిగారి వెనుక కూర్చున్న తండ్రి పట్టాభిరామయ్యగారు, ఆతని చెవిలో, 'సభలో హరి నాగభూషణంగారు ఉన్నారు. వారిని మెప్పించటం ఎవరివల్లా కాదు. జాగ్రత్తగా పాడు' అని హెచ్చరించారు. కానీ ఆ హెచ్చరికలు మురళికి ఏమి అవసరం? కేవల భగవదావేశ ప్రేరితుడై, పూర్వజన్మ సుకృతంతో ప్రజా ప్రాటవాలను పుట్టుకతోనే పుణికిపుచ్చుకొన్న వాడాయె! సాక్షాత్తూ నాగభూషణుడే వెండి కొండ దిగివచ్చినా, ఆతని పాటకు కరగిపోవలసిందే..

కచేరీ ఆరంభమైంది. వర్ణంతోనే శ్రోతల మనస్సులను ఆకట్టుకున్న ఆ గంధర్వగానం, క్రమంగా ఉప్పొంగిన కడలితరంగమై, ఉవ్వెత్తున ఎగసిపడసాగింది..

అయితే..మధ్యలో చివాలున లేచి, హరి నాగభూషణంగారు సభనుండి చరాచరా బయటకు వెళ్లిపోయారు.

'అనుకున్నంతా జరిగింది.నాగభూషణంగారికి మురళి పాట నచ్చలేదు. ఎక్కడ లోపం జరిగిందో ఏమో!' అనుకున్నారు పట్టాభిరామయ్య గారితోపాటు అక్కడివారంతా.

కానీ ఇదేదీ పట్టించుకోకుండా బాలమురళి, తన గానంలో మునిగిపోయారు. ఒక పది నిమిషాల తరువాత నాగభూషణంగారు తిరిగివచ్చారు. వారి వెనుక, వారి కుటుంబ పరివారం అంతా వచ్చారు. వారి ఇల్లు అక్కడికి దగ్గరే కావటంతో వారందరికీ మురళీగానం వినిపించటం కోసం వెళ్లి తీసుకువచ్చారు! అది అందరికీ అర్థమై, తేలికగా ఊపిరి పీల్చుకున్నారు!

నాగభూషణంగారు, వారి కుటుంబ సభ్యులు స్థిమితంగా కూర్చొని, కచేరీ ఆసాంతం ఆస్వాదించారు.



మంగళప్రదంగా కచేరీ ముగిసింది. నాగభూషణంగారు వేదిక వద్దకు వెళ్ళి, బాలమురళిని ఎత్తుకొని, వాత్సల్యంతో తలనిమిరి, తనకు బహూకరించబడిన ఒక బంగారు పతకాన్ని ఆతని జుబ్బాకు తగిలించారు. నిర్వాహకుల కోర్కెమేరకు ఆశీర్వాదపూర్వకంగా కొద్దిసేపు ప్రసంగించారు. కుర్తాళం పీఠాధిపతులు కూడా సభ పక్షాన, ఒక బంగారు పతకాన్ని మురళికి బహూకరించి, తమ పరిపూర్ణమైన దీవెనలను అందించారు.

★★★

హరి నాగభూషణంగారి కుమారులు శంకరశాస్త్రిగారి శిష్యుడు, అల్లుడైన సంగీతవిద్వాన్ పోపూరి గౌరీనాథ్ గారు బాలమురళిగారిని బెజవాడలో తమ 'సద్గురు సంగీత సభ'లో సత్కరించినపుడు మురళీగారు, పై సంఘటనను గుర్తుచేసుకుంటూ..'ఆలాపన చేసే సమయంలో ఒకస్వరంలో దీర్ఘంగా నిలిపినపుడు 'రి' అంటూ పాడే సంప్రదాయం ఒకప్పుడు ఉండేది. అయితే, నేను దాన్ని 'హరి' అని మార్చుకున్నాను. అలా పాడే సమయంలో హరి నాగభూషణంగారు నా మదిలో నిలుస్తారు' అంటూ పెద్దలఎడ తనకున్న గౌరవాన్ని చాటుకున్నారు.

నా స్వానుభవంలో తెలుసుకున్నది ..పూర్వపు గాయకులు 'రి' అంటూ నిలపడం వెనుక ఒక రహస్యం ఉంది. ఇకారంలో కుదిరిన శ్రుతిశుద్ధత, ఆకారంలో కుదరదు. అందుచేత, రాగాలాపన చేసే గాయకులు ఒక స్వరంలో ఎక్కువసేపు నిలిపేటప్పుడు 'రి' అంటూ ఆపేవారు. అయితే, మురళీగారు, 'రి' బదులు, భగవన్నామమైన 'హరి' అంటే పుణ్యం, పురుషార్థం కలిసివస్తాయని అలా 'హరినామం' చేయటం ఆరంభించారు..

ఆయన ఏది చేసినా అందులో "మురళీ" మార్కు ఉంటుంది..

# సంగీత సభల కార్యకలాపములు - 'విహారి'

## వైభవోపేతంగా జరిగిన వాగ్గేయకారోత్సవం





మే 31, 2026 ఆదివారం, హ్యూస్టన్‌లోని ఎస్వీబీఎఫ్ (SVBF) దేవాలయంలో తెలుగు సాంస్కృతిక సమితి (TCA) మరియు స్వరభారతి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన వాగ్గేయకారోత్సవం ఆద్యంతం భక్తి, సంగీత, సాంస్కృతిక వైభవాలతో అలరించింది. సుమారు 60 మంది కళాకారులు పాల్గొన్న ఈ కార్యక్రమం, హ్యూస్టన్ సంగీతాభిమానులకు వేసవి వేడిలో ఒక ఆహ్లాదకరమైన సంగీత విరామంగా నిలిచింది.

శ్రీమతి శ్రీదేవి జోస్యుల, దసిక దంపతులు దసిక నరసింహం గారు, భారతి గారు మరియు టీసీయే కార్యవర్గ సభ్యుల జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభమైంది. అనంతరం శ్రీమతి శ్రీదేవి జోస్యుల నిర్వహణలో జరిగిన "వాగ్గేయకార వైభవం" గోష్ఠిగానం విశేషంగా ఆకట్టుకుంది.

నారాయణ తీర్థుల వారి "జయ జయ



స్వామిన్", భద్రాచల రామదాసు వారి "భద్రశైల రాజమందిరా", శ్రీ శృంగేరి భారతీ తీర్థుల వారి "శంకర పూజితే శారదే", అన్నమాచార్యుల "అంతరంగమెల్ల శ్రీహరికి", నరహరి విఠలుల "వాసుదేవ కమలాసన వందిత", త్యాగరాజస్వామి వారి "జయ మంగళం నిత్య" తదితర కీర్తనలను బృంద సభ్యులు భక్తిశ్రద్ధలతో ఆలపించి శ్రోతలను భక్తి పారవశ్యంలో ముంచెత్తారు.

ముఖ్యంగా శారదాదేవి సన్నిధిలో "శంకర పూజితే శారదే, శర్వ సహోదరి" అని సమూహంగా ఆలపించిన సమయంలో ఆలయ ప్రాంగణమంతా భక్తి భావంతో నిండిపోయింది. శ్రోతలు ఆ దివ్య గానామృతంలో మునిగి తేలారు.

ఈ గానబృందంలో హిమబిందు పొన్నపల్లి, హేమ నళిని తల్లావజ్జుల, శిరీష పిల్లలమర్రి, జ్యోతి వెంకటేశన్,

అపర్ణ గంటి, కృష్ణసుందరి మారేపల్లి, గాయత్రి ముళ్లపూడి, గౌరీ అంబటిపూడి, చైత్ర భట్, గీత్ రావు, జ్యోతి రావు, జయశ్రీ బొందు, మాధవి మేక, మల్లిక కామన, నీరజ సెట్లూర్, రాజేశ్వరి ప్రభల, రుక్మిణి చీరాల, సత్యమణి ముళ్లపూడి, సుధా సాంబరాజ్, సూర్యకుమారి తదితరులతో పాటు ఆన్వి భట్, ఆనిక భట్, ఆనిక నేరెళ్ల, చిన్మయి కొండూరు, లలిత రొట్టె మరియు సంజీవ్ చిక్కల పాల్గొన్నారు. ముకుంద్ జోస్యుల వయోలిన్, విశాల్ సెట్లూర్ మృదంగ సహకారం కార్యక్రమానికి మరింత శోభను చేకూర్చాయి.

యువ కళాకారుడు అభిరామ్ కొండూరు ప్రసిద్ధ వాగ్గేయకారుల జీవిత విశేషాలను పరిచయం చేస్తూ కార్యక్రమానికి విద్యాపరమైన విలువను కూడా జోడించారు.

తదుపరి హ్యూస్టన్ పరిసర ప్రాంతాల సంగీత గురువులు తమ శిష్యులచే అన్నమాచార్య, రామదాసు, తూము నరసింహదాసు, త్యాగరాజు, శ్యామశాస్త్రి, ముత్తుస్వామి దీక్షితార్, నారాయణ తీర్థులు, మంగళంపల్లి బాలమురళీకృష్ణ, గణపతి సచ్చిదానంద స్వామీజీ తదితర వాగ్గేయకారుల కీర్తనలను గానం చేయించారు. దాదాపు ఎనిమిది గంటల పాటు సాగిన ఈ సంకీర్తన యజ్ఞంలో విద్యార్థులు ఎంతో భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ప్రముఖ గాయనీమణి మణి శాస్త్రి గారి గానం కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది

అనంతరం శ్రీకర్ సతీష్ (వేణువు), ప్రణవ్ ప్రవీణ్ (వయొలిన్), విజయ్ శంకర్ (ఘటం), విశాల్ సెట్లూర్ (మృదంగం)లతో కూడిన వాద్యలహరి బృందం అందించిన వాద్యకచేరీ





సంగీత రసికులను మంత్రముగ్ధులను చేసింది.

అంజలి సెంటర్ విద్యార్థినులు పద్మవిభూషణ్ డా. మంగళంపల్లి బాలమురళీకృష్ణ గారి కీర్తనకు అందమైన నృత్యరూపకాన్ని ప్రదర్శించగా, కళాస్రవంతి డాన్స్ స్కూల్ విద్యార్థినులు "శ్రీ గణపతిని సేవించరాదే", "ముద్దుగారే యశోద" వంటి కీర్తనలకు హావభావ సమన్వితమైన కూచిపూడి నృత్యాలను ప్రదర్శించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు.



కార్యక్రమానికి కాంత్ జోస్యుల, శ్రీదేవి జోస్యుల, హిమబిందు పొన్నపల్లి, హేమ నళిని తల్లావజ్ఝల, శిరీష పిల్లలమర్రి తదితరులు వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. జితేందర్ రెడ్డి, వంగూరి చిట్టెన్ రాజు, ఇందిరా చెరువు, సుధేష్ పిల్లుట్ల. రవి రమరిస ,మల్లిక్ పుచ్చా గార్లు సంగీత గురువులను సత్కరించి, విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు.

టీసీయే కార్యవర్గ సభ్యులు, దాతలు, స్వచ్ఛంద సేవకుల సహకారంతో దాదాపు పది గంటలపాటు విజయవంతంగా సాగిన ఈ ఉత్సవానికి 200 మందికి పైగా సంగీతాభిమానులు హాజరయ్యారు. కాంత్ జోస్యుల వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.

ఈ సంగీత యజ్ఞంలో నిర్వాహకులు శ్రోతల చెవులకు మాత్రమే కాదు, కడుపులకు కూడా పండుగ చేశారు. సమయానికి అల్పాహారం, మధ్యాహ్న భోజనం, టీ, కాఫీ, స్నాక్స్, రాత్రి భోజనం అందిస్తూ ఆతిథ్య మర్యాదల్లోనూ తమ ప్రత్యేకతను చాటుకున్నారు. మొత్తానికి సంగీతామృతంతో పాటు అన్నపూర్ణ ప్రసాదాన్నీ ఆస్వాదించిన రసికులకు ఇది మరపురాని అనుభవంగా నిలిచింది.











# శ్రీ వి. కమలాకర రావు గారి 90వ జయంతి మహోత్సవ విశేషాలు



ప్రపంచ ప్రఖ్యాత మృదంగ విద్వాంసులు, సంగీత కళాసాగర, సంగీత విద్యానిధి, సంగీత కళాచార్య, లయ భగీరథ, మృదంగ కళానిధి, మృదంగ విద్వన్మణి, మృదంగ సుధానిధి, మృదంగిక కళావతంస, మృదంగ దేశిక సార్వభౌమ, మృదంగ సార్వభౌమ ఇత్యాది అసంఖ్యాక బిరుదులతో సన్మానింపబడి, తన సుమధుర మృదంగ నాదంతో కొన్ని వేల కచేరీలు చేయడమే కాకుండా, అసంఖ్యాక శిష్య ప్రశిష్య బృందాన్ని కలిగిన శ్రీ వి. కమలాకర రావు గారి 90వ జయంతి వారి కుటుంబ సభ్యులు, శిష్య బృందం ఆధ్వర్యంలో విశాఖపట్నం నగరంలోని శ్రీ శంకర మఠంలో వైభవోపేతంగా, భక్తిశ్రద్ధలతో జూన్ 6, 7 తేదీలలో నిర్వహించబడింది. మొదటిరోజు శ్రీ K. యోగీష్ గారు (కమలాకర రావు గారి కుమారులు, ప్రఖ్యాత మృదంగ విద్వాంసులు) స్వాగత వచనాలతో కార్యక్రమాన్ని ప్రారంభించి, ఈ రెండు రోజుల కార్యక్రమ నిర్వహణ ఉద్దేశ్యాన్ని వివరించారు. తదుపరి ప్రముఖ గాత్ర విదుషి శ్రీమతి పంతుల రమ గారి గాత్ర కచేరీ ఆద్యంతం శ్రోతలను కట్టిపడేసే విధంగా సాగింది. ఈ కచేరీకి ప్రముఖ వాయులీన విద్వాంసులు శ్రీ ముట్నూరి శ్రీనివాస నరసింహమూర్తి గారి వయొలిన్ సహకారం, కమలాకర రావు గారి ప్రియ శిష్యులు శ్రీ కోటిపల్లి రమేష్ (తిరుపతి) గారి మృదంగ సహకారంతో కచేరి మరింత సొబగులు అద్దుకొంది. ఈ సందర్భంగా ఆమె 'ఏకదంతం భజేహం, క్షణమై తిరుగ, నాద కుసుమములచే, 'ఓ రంగశాయి' మొదలైన కీర్తనలను అద్భుతంగా గానం చేశారు. రెండవ రోజు సభలో శ్రీ బుద్ధవరపు మారుతీ రఘురామ్ తమ గురువుగారిని స్మరిస్తూ, ఆరోజు కార్యక్రమ వివరాలు, వాటి వెనుక ఉన్న ముఖ్య ఉద్దేశ్యం మరియు శిష్యుల, కుటుంబ సభ్యుల ఆలోచనలను తెలియజేశారు. ఈ సభకు విశిష్ట అతిథులుగా: ప్రముఖ సంగీత విదుషి శ్రీమతి మండా సుధారాణి, ప్రఖ్యాత మృదంగ విద్వాంసులు శ్రీ వంకాయల వేంకట రమణమూర్తి గారు, ప్రసిద్ధ వాయులీన విద్వాంసులు శ్రీముట్నూరి శ్రీనివాస నరసింహమూర్తి, కమలాకర రావు ఆప్తమిత్రులు, చార్టర్డ్ అకౌంటెంట్ (CA) మరియు విశాఖ మ్యూజిక్ అకాడమీ కార్యదర్శి శ్రీ వీరఘంట చంద్రశేఖర్ విచ్చేశారు. వీరందరూ శ్రీ కమలాకర రావు మృదంగ వాద్య శైలిని, వైవిధ్యాన్ని, వారి గురుభక్తిని, శిష్య వాత్సల్యాన్ని మరియు కచేరీలలో వారితో తమకున్న అనుభవాలను విశదంగా తెలియజేశారు.

**జీవితకాల సాఫల్య పురస్కార ప్రదానం:** తదుపరి శ్రీ కమలాకర రావు గారికి అత్యంత ఆప్తులు, ప్రముఖ వాయులీన విద్వన్మణి, విజయనగరం మహారాజా ప్రభుత్వ సంగీత





కళాశాల విశ్రాంత ప్రధానాచార్యులు, కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత శ్రీ ద్వారం దుర్గా ప్రసాదరావు గారికి "నాద కమలాసన" అనే బిరుదుతో "శ్రీ కమలాకర రావు స్మారక జీవిత సాఫల్య పురస్కారం" మరియు రూ. 50,000/- నగదు బహుమతిని వారి కుటుంబ సభ్యులు, శిష్యులు కలిసి అందజేసి, ఘనంగా సత్కరించారు.

శ్రీ దుర్గా ప్రసాదరావు గారు తమ ప్రతిస్పందనను తెలియజేస్తూ, కమలాకర రావు గారి మృదంగ కళా వైభవాన్ని వివరించారు. ఈ సందర్భంగా తాము స్వయంగా రచించిన ఒక కీర్తనను 'రావుప్రియ' రాగంలో అద్భుతంగా గానం చేశారు. కమలాకర రావు గారితో తమకున్న 70 ఏళ్లకు పైబడిన సంగీత అనుబంధాన్ని వారు గుర్తుచేసుకున్నారు.

**మృదంగ బహుకరణ:** అనంతరం, ప్రతి సంవత్సరం శ్రీ కమలాకర రావు గారి పేరుతో ఒక ప్రతిభ కలిగిన యువ మృదంగ విద్యార్థికి మృదంగ బహుకరణ కార్యక్రమం ఈ ఏడాది కేరళ రాష్ట్రం, కొల్లాలకు చెందిన శ్రీనివాస్ (ఈయన కమలాకర రావు గారి వద్ద కొంతకాలం విద్యనభ్యసించారు) ను ఎంపిక చేసి, వారికి శ్రీ ద్వారం దుర్గా ప్రసాదరావు గారి చేతుల మీదుగా మృదంగాన్ని అందజేశారు.

**లయ విన్యాసం – ముగింపు:** తదుపరి శ్రీ కమలాకర రావు గారి ప్రియ శిష్యులు శ్రీ పలివెల విద్యాసాగర్ (హైదరాబాద్) మరియు శ్రీ బుద్ధవరపు మారుతీ రఘురామ్ (తిరుపతి) గార్ల మృదంగ లయ విన్యాసం సుమారు 45 నిమిషాల పాటు సభారంజకంగా సాగి, ప్రేక్షకుల మరియు విద్వాంసుల ప్రశంసలు పొందింది. గురువు గారి దగ్గర తాము అభ్యసించిన అనేక నడకలను, ముక్తాయిలను వాయించి అందరి మెప్పు పొందారు. గురువుగారి ప్రియ శిష్యులు, ప్రముఖ మృదంగ విద్వాంసులు, విశాఖ వాస్తవ్యులు అయిన శ్రీ G. వెంకటరావు గారి వందన సమర్పణలో కార్యక్రమం ముగిసింది.

**పాల్గొన్న ముఖ్యులు:** ఈ కార్యక్రమంలో గురువుగారి కుటుంబ సభ్యులు శ్రీ K. యోగిష్ రాజు, శ్రీ K. జగదీష్ (చెన్నై), శ్రీ. K. హరీష్ (హైదరాబాద్) మరియు వారి గురు పరంపరలోని ప్రముఖ శిష్య, ప్రశిష్య బృందం: శ్రీ కోటిపల్లి రమేష్, శ్రీ G. వెంకటరావు, శ్రీ M. శ్రీధర్, శ్రీ పలివెల విద్యాసాగర్, శ్రీ బుద్ధవరపు మారుతీ రఘురామ్, శ్రీ వారణాసి శ్రీనివాస్, శ్రీ రజత సాయి శ్రీ మోహన సాగర్, శ్రీమతి A. జ్ఞానేశ్వరి, శ్రీ CH. భాస్కర శాస్త్రి, శ్రీ కె. జనార్ధన్, శ్రీ తోట చైతన్య మరియు ఇతర శిష్య బృందం పాల్గొన్నారు.





# గాయత్రీ మహిళా సంగీత సన్మండలిలో అన్నమయ్య 618 వ జయంతి






డా. కొమాండూరి రామాచారి గారి బృందం అన్నమయ్య పద సంకీర్తనం
200 మంది కళాకారుల చే అన్నమయ్య సప్తగిరి సంకీర్తనల గోష్టి గానం.
ఏప్రిల్ 22 న త్యాగరాజ జయంతి పంచరత్న కృతుల గోష్టి గానం.
డా. తాతా గిరిజా శేషమాంబ గారి సోదాహరణ పూర్వక కచేరి.











## వైభవంగా త్యాగరాజస్వామి ఆరాధనోత్సవం



స్థానిక లక్ష్మీపురం శ్రీ త్యాగరాజస్వామి కళావేదికపై గాయత్రీ మహిళా సంగీత సన్మండలి ఆధ్వర్యంలో శ్రీ త్యాగరాజు స్వామి 259వ జయంతి మహోత్సవం 22-04-2026 బుధవారం వైభవంగా జరిగింది. తొలుత టి. ఆదిత్య వాణి, వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శనగల రామమోహన్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మొదటగా స్థానిక, స్థానికేతర కళాకారులు శ్రీ త్యాగరాజ స్వామి విరచిత పంచరత్న కీర్తనలను శ్రావ్యంగా ఆలపించారు. ప్రముఖ సంగీత విద్వాంసురాలు డాక్టర్ తాతాగిరిజా శేషమాంబ శ్రీ త్యాగరాజు స్వామి, వాల్మీకి రామాయణం సోదాహరణ ప్రసంగ పూర్వక గాత్ర కచేరి వీనుల విందుగా సాగింది. వయోలిన్ పై దావులూరి శ్రీ విద్య, మృదంగంపై ఏ. ఎస్. ఆర్. కౌండిన్య వాయిద్య సహకారం అందించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సంస్థ ప్రధాన కార్యదర్శి ఎం.వై. శేషురాణి, ఉపాధ్యక్షురాలు డాక్టర్ రాజరాజేశ్వరి, పాటిబండ లలిత, మాధవపెద్ది మీనాక్షి, కార్యదర్శి పి.వి. మంగాదేవి, కోశాధికారి మాధవపెద్ది విజయలక్ష్మి తదితరులు పాల్గొని కళాకారులను ఘనంగా సత్కరించారు.

## గౌరీరామ్మోహన్ కు శ్రీభక్త జ్ఞానానంద అవార్డు ప్రదానం





గాయిత్రీ మహిళా సంగీత సన్మండలి నెలవారీ కార్యక్రమంలో భాగంగా 20-6-2026 న శ్రీ అన్నమయ్య కళావేదిక, శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం బృందావన్ గార్డెన్స్ లో శ్రీ భక్త జ్ఞానానంద తీర్థ మెమోరియల్ అవార్డు 36వ ఆరాధనా సంగీత మహోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డా. యం. శ్రీధర్ (ఆప్తమాలజిస్ట్), ఆత్మీయ అతిథిగా శ్రీ జగిరాల రామకృష్ణ పాల్గొన్నారు.

భక్త జ్ఞానానందతీర్థ మెమోరియల్ అవార్డ్ ను విశాఖకు చెందిన సంగీత సుధానిధి, సంగీత కళా మనోజ్ఞ, సంగీత కళానిధి ప్రొ. వి. గౌరీ రామ్మోహన్ గారు అందుకున్నారు. అనంతరం వారి సంగీత కచేరీ జరిగింది. మొదటగా మాండ్ రాగంలో వర్ణం జననీ వీణాపాణి, స్వీయరచనతో మొదలుపెట్టి, అనంతరం బిలహరి రాగంలో దీక్షితార్ రచన ఏకదంతం, ఓగిరాల వారి రచన ఆలించు, పాలించు శుద్ధ ధన్యాసిలో, నామనసు మార్చవ మాయామాళవగౌళలో, నేడే నిన్ను సేవింప భైరవిలో, వేవేగరావేల వేణుగోపాల మొదలగునవి గానం చేసారు. భజన సేయవే, కళ్యాణిలో త్యాగయ్య రచన గానం చేసారు. వైలిన్ పై శ్రీ సిహెచ్. రామచరణ్, మృదంగంపై శ్రీ కె. అరవింద్ సహకరించారు. కచేరీ సాంతం సంగీత రసజ్ఞులను రంజింపచేసింది. కార్యక్రమాన్ని డా. యం. శ్రీధర్ దంపతులు, డా. ఆర్. సుజాత, డా. సి. జ్యోతి సమకూర్చారు. కార్యక్రమాన్ని ప్రధాన కార్యదర్శి. యం.వై. శేషురాణి; డా. రాజరాజేశ్వరి, మంగ మొదలగువారు నిర్వహించారు.

**- మాధవపెద్ది మీనాక్షి**



**సరస్వతీ గానసభ, కాకినాడ వారి స్వర్గీయ లక్కరాజు శేషకుమారి స్మారక సంగీత శిక్షణాలయం వేసవి శిక్షణా శిబిరం ముగింపు ఉత్సవం. ముఖ్య అతిథి డా. ఐ.వి.రావు గారికి జ్ఞాపికనందజేస్తున్న సభ ఉపాధ్యక్షులు శ్రీ లక్కరాజు సత్యనారాయణ(టిక్కు).ప్రసంగిస్తున్న డా.ఐ.వి.రావు.**





## ఘనంగా పోడూరి గోపాలకృష్ణ శతజయంతి వేడుకలు



ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ విజయనగరం నిర్వహణలో సంస్థ కార్యాలయం ఆర్యసోమయాజుల కాశీపతిరావు స్మారక భవనంలో ఆదివారం సాయంత్రం సంస్థ ప్రధాన అధ్యక్షులు పోడూరి గోపాలకృష్ణ శతజయంతి ఉత్సవం అత్యంత ఘనంగా జరిగింది. సుజాత మరియు డాక్టర్ శ్రీనగేష్ పోడూరి సౌజన్యంతో నూతన సమసీతలీకరణ వ్యవస్థ ప్రారంభించారు. ఎఫ్.ఎఫ్.ఎ. అధ్యక్షులు ధవళ సర్వేశ్వర రావు, ప్రఖ్యాత చార్టెడ్ అకౌంటెంట్ ఇ. ఆర్.సోమయాజులు(రాంజీ) ఎలక్ట్రికల్ ప్రాంతీయ ఇంజనీర్ వెంకటేష్ సభను ఉద్దేశించి ప్రసంగించారు. భవన నిర్మాణానికి కృషి చేసిన వారిని ఘనంగా సత్కరించారు. అనంతరం కేరళాకి చెందిన విద్వాంసులు శంకరన్ నంబూద్రి గాత్రకచేరి అందరిని అలరించింది. దీక్షితార్ గణేష కృతితో కచేరి ప్రారంభించి, రాగంలో త్యాగరాజ కృతి శోభిల్లు సప్తస్వర, ప్రధానంగా చక్కని రాజమార్గం త్యాగరాజస్వామి వారి కృతి ఆలపించారు. వయొలిన్ పై ఆముదాలవలసకి చెందిన డాక్టర్ మావుడూరు సత్యనారాయణ శర్మ మృదంగంపై సంస్థ కార్యదర్శి డాక్టర్ మండపాక రవి, ఘటంపై గుంటూరు కి చెందిన ఎం.హరిబాబు చక్కగా ధీటుగా సహకరించారు. విద్వాంసులను సంస్థ సభ్యులు, స్థానిక విద్వాంసులు ఘనంగా సత్కరించారు. డాక్టర్ చీలా రవిశంకర్ సభాకార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ దేశాల్లో ఉన్న పోడూరి గోపాలకృష్ణ కుటుంబ సభ్యులు, నగరంలో ప్రముఖులు, డాక్టర్ డి.వి. శ్రీకాంత్, డాక్టర్ కుమారస్వామి, ఉసిరికల చంద్రశేఖర్ రావు, శారద, డాక్టర్ పద్మప్రియ, టి. మహేశ్వర రావు, మోడెకుర్తి శ్రీనివాస రావు, విద్వాంసులు, సంగీతాభిమానులు విశేషంగా పాల్గొన్నారు.

**– డాక్టర్ మండపాక రవి**

# స్వరభారతి - తిరుపతి



నెలవారీ సంస్థ నిర్వహణలో 17.5.2025 మే నెల కార్యక్రమంగా కుమారి భానుశ్రీ పూర్ణిమ వేణుగాన కచేరీ అభిజిత్ నరసింహన్,టి.వి.కృష్ణవంశి వయొలిన్-మృదంగ సహకారాలతో జరిగింది. 'రార వేణుగోపబాల' అంశంతో ప్రారంభించి తిల్లాంగ్ రాగ 'మహాగణపతే'; రాగరత్నమాలికచే - రీతిగౌళ కృతి; దేవదేవ జగదీశ్వర-పూర్వీకల్యాణి చివరగా రామచంద్రుడితడు తో ముగించారు. రంజకంగా సాగింది సభ.

రెండవ కార్యక్రమంగా విదుషి శ్రీమతి అనువ్రతా నరసింహన్ "సన్నిహిత రాగాలు" అన్న విషయంపై సోదాహరణ ప్రసంగసభ చేశారు. కేదారగౌళ-సురటి; దర్బార్-నాయకి; భైరవి-ముఖారి; శంకరాభరణం-ఆరభి-సామ ఈ రాగాలలోని సామ్యాలను వివరిస్తూ, స్థూలంగా స్వరాల నిర్మాణం ఒకటే అయినా సంచారాలు-గమకాలు వేరు వేరుగా వుండి తమ తమ రాగ స్వరూపాన్ని సంతరించుకొని అలరిస్తాయని పాడి వివరించారు. ఇంకా తమ ప్రసంగంలో ఆరభిలో జంట స్వర ప్రయోగాలు శంకరాభరణంలో వలె కనిపించవని, సాధారణ ప్రయోగాలే వుంటాయని, ఆరభిలో గ, ని ప్రయోగాలకు ప్రాధాన్యం కనిపించదని, సామ లో 'గ'కు ప్రాధాన్యత వుంటుందని తెలిపారు. మిగతావి ఆరభిలానే అన్నారు.

కాలప్రమాణం ప్రాధాన్యత, ప్రాముఖ్యత వివరణలో సరియగు వేగం లేదా గతి (Tempo)-నిర్దిష్టమైన స్వరం ఎంత ముఖ్యమో వివరించారు.

ఉదాహరణగా శంకరాభరణం-నీలాంబరి; శ్రీ-మధ్యమావతి-మణిరంగు-పుష్పలతిక; ఆనందభైరవి-హుస్సేని రాగాలను పాడి వివరించారు. శరద్యుతి కొమాండూరి స్వాగతం పలికి కళాకారులను పరిచయం చేసారు.

శ్రీ వెంకటకృష్ణ వందనసమర్పణ చేశారు.



# అలరించిన వయొలిన్ కచేరీ



శ్రీ సద్గురు సన్నిధి నెలవారీ శాస్త్రీయ సంగీత, నృత్య కార్యక్రమాల్లో భాగంగా 07-06-2026 ఆదివారం సాయంత్రం జరిగిన వయొలిన్ కచేరీ ఆలరించింది. గోదావరి గట్టున ఉన్న శ్రీత్యాగరాజ నారాయణదాస సేవా సమితి ప్రాంగణంలోని వేదికపై శ్రీహరి ప్రసాద్ వయొలిన్ కచేరీ చేయగా, కె. జగన్మోహినీ మృదంగం, ఎ. అనిల్ కుమార్ ఘటంపై సహకరించారు. జయజయ స్వామిన్, వాంఛతో, మరువకవే మనసా ఇకనైనా, ఎటుల బ్రోతువో తెలియ, లావణ్య రామ, ఎంతముద్దో, మనవి ఆలకింప రాదటే, భజనసేయరాదా ఓ మనసా (ప్రధానాంశం) రక్తిగా వినిపించారు. ఆనంతరం ఏలూరిపాటి మహతి భాగవతారిణి సీతాకల్యాణం హరికథతో ఆకట్టుకున్నారు. పురాణం గణపతిరావు వయొలిన్, కె. సాయికృష్ణ మృదంగంపై సహకారం అందించారు. సంగీతాభిమానులు విచ్చేశారు.

## శ్రీ త్యాగరాజ సాంస్కృతిక సంఘం, గుంటూరు.

శ్రీ త్యాగరాజ సాంస్కృతిక సంఘం, గుంటూరు వారి ఆధ్వర్యంలో మే 30,31తేదీలలో విద్వాన్ మోహన్ సంతానం గారి చే "కల్పిత సంగీతం నుండి మనోధర్మ సంగీతం" work shop నిర్వహించబడినది. తొలిరోజు కిరణావళి రాగంలో త్యాగరాజస్వామి అపురూప కీర్తన నేర్పించిరి. అనంతరం వర్ణం, కీర్తనల ఆధారంతో శంకరాభరణం, మోహన రాగాలపన చెయ్యటం ఎలాగో మార్గదర్శనం చేసి, తరువాత రోజు దానినే మరొకమారు బోధించి కీర్తనలలోని పల్లవుల ఆధారంగా పల్లవి కూర్చటం, విద్వాన్ టి.ఆర్. సుబ్రహ్మణ్యం గారి పల్లవి మోహనలో ఒకటి మూర్చన ఆధారంగా స్వరప్రస్తారం, సంచారం యెలా గ్రహించాలి, కీర్తనలోని సంగతులు యెలా ఉపయోగించు కోవచ్చును వంటి మర్మములను సూచించారు. యీ కార్యక్రమానికి ఇతరప్రదేశాల నుండి కూడ ఒకరిద్దరు వారి online శిష్యుల తో కలిపి ఒక పాతికమంది వచ్చారు. కార్యక్రమం ఉపయోగవంతం గా ఉన్నదని విద్యార్థులు భావించారు.







## శ్రీ త్యాగరాజ సాంస్కృతిక సంఘం, గుంటూరు.



శ్రీ త్యాగరాజ సాంస్కృతిక సంఘం, గుంటూరు నిర్వహణలో 7.6.26 న మహదేవన్ శ్రీరామ్-తిరువనంత పురం వారి గాత్రసంగీత సభ లో ఇంతమోడి సారంగ వర్ణం, ఓ జగదంబ-ఆనందభైరవి, ఇంత తామసమైతే; నీపదములే-పూచి శ్రీనివాస అయ్యర్ -నవరసకన్నడ అంశం;శ్రీ కాళహస్తీశ, తోడిలో దాశరథి; భజరే శ్రీరామం, నానాటి బ్రతుకు, మంగళం చోటు చేసుకొన్నాయి. KVN బాణికి దగ్గరగా ఉంది. మంచిగాత్రం, గమకపుష్టి గల శారీరం. పూచి వారి నవరసకన్నడ, ముత్తుస్వామివారి హుసేని కీర్తనలు అరుదయినవి అనే చెప్పాలి. శబ్దదోషాలు సరిచూసుకోవాలి. రాగసంప్రదాయం బాగుంది. తోడి విశేషంగా ఉంది, నెరవల్ "భుక్తి ముక్తి నిచ్చు కీర్తనలు" పంక్తి తీసుకొన్నారు. కానీ, అంతగా రాణించ లేదు. కళాత్మకత మరింత అవసరం. మొత్తం మీద చక్కని కచేరి. కార్తికేయ ఆదినారాయణ మృదంగం పై దీటుగా స్పందించారు. పి.నందకుమార్ కూడ నీడలా వెంట నడచి సహకరించారు.

## ఘనంగా ప్రపంచ సంగీత దినోత్సవ వేడుకలు





రోటరీ దశిగి పేర్రాజు మ్యూజిక్ అకాడమీ మరియు ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ విజయనగరం సంయుక్త నిర్వహణలో కొత్తగ్రహారం రోటరీ కమ్యూనిటీ హాల్ లో సుజాత మరియు డాక్టర్ శ్రీనగేష్ పోదూరి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ సంగీత దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఎఫ్.ఎఫ్.ఎ. అధ్యక్షులు ధవళ సర్వేశ్వర రావు, పోదూరి గోపాలకృష్ణ కుటుంబ సభ్యులు, ఉసిరికల చంద్రశేఖర్ రావు, అకాడమీ సభ్యులు, విద్వాంసులు త్యాగరాజస్వామి వారి చిత్రపటానికి పూలమాలలు వేసి వేడుక ప్రారంభించారు. ఐర్లాండ్ దేశానికి చెందిన వంక శ్రుతి రవళి గాత్రకచేరి అందరిని అలరించింది. నాటకురంజి రాగ వర్ణంతో కచేరి ప్రారంభించి, బాగానయ్య, మరివేరే, సరోజదళనేత్రి తదితర కృతులను ఆలపించారు. వయొలిన్ పై రాంచరణ్, మృదంగంపై అకాడమీ ప్రిన్సిపాల్, ఎఫ్ ఎఫ్ ఎ కార్యదర్శి అయిన డాక్టర్ మండపాక రవి, మోర్సింగ్ పై వెంకటరావు చక్కగా సహకరించారు. అనంతరం ఇరువురి సభ్యులు కలిసి సీనియర్ కళాకారిణి తాళాబత్తుల అమ్మాజీ గారిని ఘనంగా సత్కరించారు. నగరంలో ప్రముఖులు, డాక్టర్ డి.వి. శ్రీకాంత్, డాక్టర్ ఎ.గోపాలరావు,డాక్టర్ అయ్యగారి రాఘవరావు, మండ ప్రసాద్, మండపాక శ్రీదేవి, శారద, పద్మప్రియ, మహేశ్వర రావు, భానుహర్ష, మంగతాయారు, మోడెకుర్తి శ్రీనివాస రావు, సతీష్, బాలాజీస్వామి, విద్వాంసులు, సంగీతాభిమానులు విశేషంగా పాల్గొన్నారు.

ఉదయం అకాడమీ పద్మావతినగర్ శాఖలో డాక్టర్ పద్మప్రియ నిర్వహణలో విద్యార్థుల ప్రదర్శనలు, స్కాలర్షిప్పులు కార్యక్రమం జరిగింది.

**– డాక్టర్ మండపాక రవి**

## అలరించిన గాయత్రి వరేణ్య గాత్రకచేరి



ప్రపంచ సంగీత దినోత్సవం సందర్భంగా కాకినాడ జిల్లా పిఠాపురంలోని సూర్యరాయ విద్యానంద గ్రంథాలయంలో జరిగిన గాయత్రి వరేణ్య (విశాఖపట్నం) గాత్రకచేరి ఆహూతులను అలరించింది. వజ్రాయుధ కవి ఆవంత్స సోమసుందర్ స్మారకార్థ వారి కుటుంబ సభ్యులు ఈ సంగీత కార్యక్రమం నిర్వహించారు. గాయత్రి వరేణ్యకు వయోలిన్పై యు. శ్రీహరి ప్రసాద్(కాకినాడ), మృదంగంపై పి.వి.ఎస్. బాలాజీ యువరాజ్ (విశాఖపట్నం) చక్కని సహకారం అందించారు. త్యాగయ్య, అన్నమయ్య మొదలైన వాగ్గేయకారుల కీర్తనలను గాయత్రి వరేణ్య ఆలపించి సంగీత ప్రియులను అలరించారు. డా. అనురాధ, కొండేపూడి శంకరావు, వెన్నపు చక్రధర రావు, కె. గౌరి నాయుడు, దుర్గాప్రసాద్, మన్మథ రావు, శ్రీదేవి, గట్టి శ్రీ కృష్ణ దేవరాయలు, అల్లవరపు నగేష్, అధిక సంఖ్యలో సంగీత ప్రియులు హాజరయ్యారు.

## సత్కళావాహిని యువవాహిని నిర్వహణలో ప్రపంచ సంగీతదినోత్సవం



వందమంది సంగీత-నాట్యకళాకారులతో "మేళకర్త రాగాంజలి".

కాకినాడలో మొదటిసారి యువకళాకారుడు ఈయుణ్ణి లక్ష్మీకృష్ణ ఆధ్వర్యంలో విద్వాన్ ఇ.వి.కృష్ణమాచార్యుల నిర్దేశకత్వంలో నిర్వహించారు. ఇందులో స్థానిక సంగీత విద్వాంసులు వాగ్గేయకారుల వేషధారణతో గత వైభవాన్ని చూపగా నృత్య కళాకారుల సమాఖ్య నుండి నాట్య గురువులు తమ శిష్య బృందం తో మేళకర్త రాగాలలోని పన్నెండు చక్రములలోని రాగాలను తమ నాట్యంతో ప్రదర్శించారు. ఇందుచక్రం, నేత్రచక్రం, అగ్నిచక్రం, వేదచక్రం ఇలా పన్నెండు చక్రాలలోని రాగాలను వ్యక్త పరచారు.

ప్రముఖ సినీ సంగీత దర్శకుడు శ్రీ స్వర వీణాపాణి,కేంద్ర సంగీత నాటక అకాడమీ సభ్యులు శ్రీమతి ఎస్.పి.భారతి, బి.జె.పి మహిళామోర్చ రాష్ట్ర కార్యదర్శి శ్రీమతి సాలగ్రామ లక్ష్మీ ప్రసన్న ముఖ్య అతిధులుగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన తో కార్యక్రమ శుభారంభం చేశారు.

ఇంకా నాట్యగురువులు హరిలోకేశ్ శర్మ, ఆనెం ప్రసాద్, బి.మల్లికార్జున - సౌమ్య, జగజ్జోతి - గణేశ్ హరిహరన్, ఆకెళ్ళ పద్మావతి, స్వప్నా ప్రసాద్, ఎన్.సి.హెచ్. లక్ష్మీ శాంతి, టి.కల్యాణి, వి.లలితా నాయుడు, ఎమ్. విజయలక్ష్మి, బి.శ్రీవాణి-శ్రీదేవి, పైడ శ్రీనివాస్-అర్చన తమ శిష్యులు 72మందితో రాగానికి ఒక నాట్య బృందంతో అభినయం చేయించారు. విద్వాన్ శ్రీ ఇ.వి. కృష్ణమాచార్యులు దంపతులను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించి వారి సేవలను కొనియాడారు.

పలువురు సంగీత విద్వాంసులకు,నాట్య గురువులకు సన్మానం చేశారు.

## భమిడి వారికి 'శ్రీకళాపూర్ణ' అవార్డు



తణుకు నగరంలో దశాబ్దాలుగా సంగీత కళాశాల నిర్వహిస్తూ, సంగీత సభలు ఏర్పాటు చేస్తూ నిరంతరం సంగీతమే ఊపిరిగా సేవలందిస్తున్న విదుషీమణి శ్రీమతి భమిడి కమలాదేవి చేసిన సేవలకు గుర్తింపుగా చికాగో (అమెరిక)లో శ్రీ అన్నమాచార్య ప్రాజెక్ట్ ఆఫ్ నార్త్ అమెరిక (SAPNA) మరియు SRI ఫౌండేషన్ వారు 'శ్రీకళాపూర్ణ' బిరుదు తో గౌరవించారు. ఈ బిరుదు ఫలకాన్ని ఆమె కుమారుడు శ్రీ భమిడి సూర్యనారాయణ మూర్తి, మనుమడు చి.గౌతమ సంస్థ వ్యవస్థాపకులు డా.శ్రీరామ్ శొంఠి-డా.శారదాపూర్ణ శొంఠి చేతులమీదుగా అందుకొన్నారు. గానకళ వారికి అభినందనలు అంద జేస్తున్నది.



# అలరించిన అన్నమయ్య కీర్తనలు



3.5.2026 ఆదివారం శ్రీరామ సమాజంలో అన్నమయ్య పాటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు..







అన్నమయ్య జయంతి సందర్భంగా సంస్కార భారతి, శ్రీరామసమాజం ఆధ్వర్యంలో 01-05-2026 శుక్రవారం నిర్వహించిన అన్నమయ్య కీర్తనల ఆలాపన పోటీలకు విశేష స్పందన లభించింది. ఈ పోటీలు జూనియర్స్, సీనియర్స్, సూపర్ సీనియర్స్ విభాగాలుగా నిర్వహించారు. యాభై మంది ఈ పోటీలో పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా ప్రముఖ వీణ విద్వాంసులు డి. నగేష్ బాబు, ప్రముఖ గాత్ర విద్వాంసురాలు శ్రీమతి చావలి సూర్య కుమారి వ్యవహరించారు. శ్రీరామ సమాజం కార్యదర్శి శ్రీ మునుగంటి వెంకటరావు ''అన్నమయ్య సామాజిక స్పృహ'' అంశంపై ప్రసంగించారు. అనంతరం న్యాయనిర్ణేతలను, ప్రసంగీకుని సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంస్కార భారతి అధ్యక్షుడు ఆకొండి శ్రీనివాస రాజారావు, సంస్కార భారతి ఉపాధ్యక్షుడు విష్ణుభట్ల శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

## సంగీత లహరి - రాజమహేంద్రవరం.



వారి నెలవారి సంగీత సభలలో భాగంగా జూన్ 28 న స్థానిక మృదంగ విద్వాంసులు కమలాకర యోగీష్ గారి 'సోదాహరణ ప్రసంగం' ఏర్పాటు చేశారు.

ఉపన్యాసం లో భాగంగా యోగీష్ గారు మనం అంతా 'లయ మనలోఅంతర్భాగంగా' నే జన్మించాము అని ఉదాహరణ లతో వివరించారు. మృదంగ వాయిద్యం లో విశేషాలను చక్కగా వివరించారు. వర్ణం కి ఎలా సహకరించాలి, పై కాలం మరియు కింద కాలం కీర్తనలకు ఎలా సహకరించాలి అని వాయించి చూపారు. అనంతరం శ్రోతలు అడిగిన సందేహాలను చక్కగా వివరించారు. తని ఆవర్తనం ఎలా వాయించాలి, దానిలో ఉండే వివిధ ప్రక్రియల గురించి, మొహరా మరియు ముక్తాయి అంటే ఎలా ఉంటుందో వాయించి చూపారు. వీరికి గాత్రం పై చి॥ బి. రవికిరణ్ సహకరించారు. వారు పాడిన సావేరి రాగ వర్ణం మరియు దినమణి వంశ అనే కీర్తన శ్రోతల మన్ననలు అందుకొంది.



సభ రెండవ భాగంలో యోగీష్ గారి ఆధ్వర్యంలో లయవిన్యాసం జరిగింది. ఇందులో శ్రీయుతులు కె. యోగీష్ మృదంగం, సరస్వతుల హనుమంత రావు గారు ఘటం, రామవరపు సహదేవుడు కంజిరా, రామవరపు సుధాకర్ డోలు పై సహకరించారు. ఆది తాళం లో వీరు వివిధ గతుల ను వాయించారు. లయవిన్యాసం అనంతరం శ్రోతలు అందరు స్టాండింగ్ ఒవేషన్ ఇచ్చారు.

ఇటువంటి వివరణాత్మక ఉపన్యాసం మిగతా అన్ని వాయిద్య కళాకారుల సహాయం తో ఏర్పాటు చేయమని వచ్చిన శ్రోతలందరు కోరడం కొస మెరుపు. ఈ కార్యక్రమం లో వీణ పై స్థానిక విద్వాంసులు శ్రీ ఈశ్వర్ కుమార్ దేవ గ సహకరించారు. చివరగా ఈశ్వర్ గారు వాయించిన 'భో శంభో శివ శంభో' కీర్తన శ్రోతలను మంత్ర ముగ్ధులను చేసింది.

## విశాఖ మ్యూజిక్ అకాడమీ - విశాఖపట్నం



28-05-2026 న కేంద్ర సంగీత నాటక అకాడమీ ఎవార్డ్ కు ఎంపికయిన విదుషి శ్రీమతి పంతుల రమ కు అభినందనపూర్వక సత్కారం నిర్వహించిన విశాఖ మ్యూజిక్ అకాడమీ సభ్యులు మరియు స్థానిక సంగీత సంస్థలు సభానంతరం శ్రీమతి పంతుల రమ గాత్ర సంగీత సభ ప్రతిభాపూర్వకంగా జరిగింది. శ్రీ ఎం.ఎస్.ఎన్. మూర్తి గారు వయొలిన్ పై, శ్రీ జి.వెంకట్రావు గారు మృదంగం పై సమయోచిత సహకారం అందించారు.

## స్వరఝరి - విజయవాడ

1-7-2026 నాడు "స్వరఝరి" సంస్థ పక్షాన బెజవాడలో మోదుమూడి సుధాకర్ ఇంట్లో "వర్ణ మేళా" కార్యక్రమం జయప్రదం అయింది.. అరుదైన శ్రుతిరంజని, శుద్ధ ధన్యాసి, హమీర్ కళ్యాణి,వీణావాదిని,రీతిగౌళ,మలయమారుత,నాట, హంసానంది, రామప్రియ, ఖమాస్, దేవగాంధారి మొదలైన ఇరవైకి పైగా తాన ,పదవర్ణాలు గాయకులు పాడటం జరిగింది. సర్వశ్రీ మోదుమూడి సుధాకర్, అంజన, వేమూరి విశ్వనాథ్, మల్లాది కార్తీక త్రివేణి, జే.చంద్రమౌళి, బుర్రా నీలకంఠ శాస్త్రి, లంక తేజస్వి తదితరులు పాల్గొన్నారు.







## విజయవాడలో నెలనెల త్యాగ పంచమి





సద్గురు శ్రీ త్యాగరాజస్వామి వారి పుణ్య తిథి అయిన బహుళ పంచమి నాడు ఆ మహనీయుని స్మరించుకుంటూ ప్రతి మాసమూ విజయవాడ నగరంలో నిర్వహించబడుతున్న "త్యాగ పంచమి" కార్యక్రమాన్ని, జూన్ నెలలో 5-6-2026 శుక్రవారం నాడు మోదుమూడి సుధాకర్ ఇంట్లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంగీత కళాకారులు, సంగీత ప్రియులు, భగవత్భక్తులు అయిన ఎందరో విచ్చేసి, త్యాగయ్యకు నివాళి అర్పించి, సద్గురుకృపకు పాత్రులు అయ్యారు. పాతికమందికి పైగా గాయకులు, త్యాగరాజ కీర్తనలను ఆలపించారు.

# రవీంద్ర భారతిలో సంగీత సుమాంజలి కార్యక్రమం, హైదరాబాద్





31-05-2026 న హైదరాబాద్ సోదరీమణులైన లలిత, హరిప్రియ శిష్య పరంపరలో భాగంగా రాగవాహిని మ్యూజిక్ అకాడమీ నిర్వాహకురాలు శ్రీమతి చివుకుల మాధవి, సౌందర్య గానలహరి నిర్వాహకురాలు శ్రీమతి భాగ్యలక్ష్మి రవీంద్ర భారతిలో సంగీత సుమాంజలి కార్యక్రమం తమ శిష్యులతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీ ఎన్. వి.ఎస్. విద్యాలంకార్ గారు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఐ.ఏ.ఎస్. అధికారి శ్రీ హరీష్ రెడ్డి గారు మరియు విద్యాభారతి కేంద్ర సంఘటనా మంత్రి శ్రీ లింగం సుధాకర్ రెడ్డిగారు ఈ కార్యక్రమంలో పాల్గొనటం విశేసం. భాగ్యలక్ష్మి గారి శిష్యులు ముందుగా విరిబోణి అటతాళ వర్ణం 5 కాలాలు పాడి ప్రేక్షకులను అలరించారు. తరువాత దేవదేవంభజే హిందోళ రాగం, ఖండచాపు తాళం, అన్నమాచార్య కీర్తన మోహన కళ్యాణి రాగంలో లాల్గుడి తిల్లానా చక్కగా ఆలపించారు. శ్రీమతి మాధవి గారి శిష్యులు స్వాతి తిరునాళ్ రచించిన శ్రీరామచంద్ర, హిందోళ వర్ణం, ఆదితాళం, జనని భావయే వైదేహి, భద్రాచల రామదాసు కీర్తన జోగ్ రాగంలో, హనుమంత ధీమంత గుణవంత బలవంత మధువంతి రాగంలో గానం చేశారు. వరుసగా శ్రీరాముడు, సీతాదేవి హనుమంతుడు ఈ కృతులలో స్తుతించబడటం విశేషం. తదుపరి సీనియర్ విద్యార్థులు తమ వ్యక్తిగత ప్రదర్శనలు ఇచ్చారు.



**ఇటీవల హైదరాబాద్ శ్రీ చంద్రశేఖరేంద్ర సంగీత ఎడ్యుకేషనల్ ట్రస్ట్ కార్యక్రమాలలో గానంచేసిన విజ్ఞానసమితి కార్యదర్శి శ్రీ సుజ్ఞాన్.**




**సౌత్ ఇండియా కల్చరల్ అసోసియేషన్ మరియు విజ్ఞానసమితి ఆధ్వర్యంలో 14.6.26న విదుషి శ్రీమతి వంక శ్రుతి రవళి గాత్ర సభకు సర్వశ్రీ సరస్వతుల పార్థివ,వంకాయల కల్యాణ అభిజిత్,రాహుల్ సుందర్ సహకారాలు.**

# శాస్త్రీయ మాండోలిన్ శిక్షణ




మాధవన్ మాడభూషి మాండోలిన్ స్వరనాద సమర్పణ. ప్రఖ్యాత మాండోలిన్ వాదకులు విద్వాన్ శ్రీ యు.పి.రాజు మరియు విదుషి శ్రీమతి యు.నాగమణి గారల శిక్షణ లో తయారయిన మరో శిష్యుడు చి. మాధవన్ మాడభూషి(అమెరిక)తన మొదటి కచేరీని 21జూన్ 2026న జి.జి.కన్వెన్షన్ హాల్ ,ఇ.సి.ఐ.ఎల్, హైదరాబాద్ లో చేసి సంగీత ప్రియుల మెప్పు పొందాడు. తన కచేరీ మొదటగ సరసుడ–సావేరి వర్ణం తో ప్రారంభించి,మహాగణపతిం,ఎందరో మహానుభావులు ,మరివేరె దిక్కెవ్వరు–లతాంగి;రాజరాజ –నిరోష్ఠ రాగం;ఖరహరప్రియ రాగంలో రాగంతానంపల్లవి–రాగమాలికగ కల్పనస్వరం బిలహరి, లలిత,అమృత వర్షిణి రాగాలలో గురువులు శ్రీ యు.పి.రాజు–శ్రీమతి నాగమణి గారల రచన, శంకరాభరణంలో ఇంగ్లీషు నోటుస్వరం, డా.బాలమురళీగారి కదనకుతూహల రాగతిల్లాన,అదివో అల్లదివో –అన్నమయ్య అంశం తో సభ ముగించాడు.

ఈ కార్యక్రమానికి శ్రీ వి.వి.శ్రీనివాసరావు వైలన్ పై,శ్రీ రామకృష్ణన్ నీలమణి మృదంగం పై,ట్రిచి వి.మురళి ఘటంపై అనుభవ పూర్వక సహకారం అందించగా శ్రీ యు.పి. రాజుగారి పెద్ద కుమారులు వర్ధిష్ణు మాండలిన్ కళాకారులు గురువుల తరఫున విచ్చేయటమే కాకుండా తంబుర,తాళ సహకారంతో మార్గదర్శనం చేశారు. ఈ కార్యక్రమాన్ని తమ వ్యాఖ్యానంతో విదుషి శ్రీమతి సుధా అనంత్ రసవంతం చేశారు. ఈ చిరంజీవి తండ్రి అమెరికాలో పేరొందిన వైద్యులు, సంగీత ప్రియులు, పోషకులు. తమ పిల్లలిద్దరికీ సంగీతం పట్ల మక్కువ కల్పించిన డా.మాడభూషి జయకృష్ణ శ్రీనివాస్, తల్లి డా. రోహిణి అభినందనీయులు.




వీరి పెద్ద కుమారుడు రాఘవన్ మాడభూషి కూడా శ్రీ యు.పి.రాజు దంపతుల వద్దే శిష్యరికం చేసి గురువుల వద్ద నుండి పరిణితి పొందిన ప్రశంసాపత్రాన్ని అందుకొన్నాడు. అంతేకాదు సంగీత విద్యా ప్రదర్శన చేసి సంగీత ప్రియుల మెప్పు పొందాడు. అన్నదమ్ములిరువురూ కలిసి చక్కని ప్రదర్శన ఇవ్వడం సమీప భవిష్యత్తులో చూడబోతున్నాము.

# సంగీతలహరి – రాజమహేంద్రవరం

సంగీత లహరి, రాజమహేంద్రవరం వారి నెలవారీ కార్యక్రమాలలో భాగంగా ది.31.5.2026న "బాలోత్సవం"జరిపారు. ఇందు మొదట చిరంజీవులు విస్సాప్రగడ కామేశ్వరీ శ్రీమహతి-కోలపల్లి శ్రీహరిణి-వీణాద్వయం జరిగింది. తరువాత చి.కొచ్చెర్లకోట విద్యాకార్తీక, లక్ష్మీ శరణ్య గాత్ర కచేరి చేశారు. తదుపరి చి.లు. కురెళ్ళ కార్తికేయ, రామవరపు వెంకట కార్తికేయ ల మృదంగ డోలు లయవిన్యాసం జరిగింది. పిల్లలు చక్కని ప్రతిభ చూపారు. శ్రీ మద్ది ఈశ్వర కుమార్ దేవ్ వైలన్ పై,శ్రీ వంగల నరసింహాచార్యులు ,కురెళ్ళ కార్తికేయ మృదంగంపై సహకరించారు.















శ్రీశైలం దేవస్థానంలో
భక్తిసంగీత కచేరీ చేసిన
విద్వాన్ శ్రీ భాగి నారాయణశాస్త్రి.

## సత్కళావాహిని, కాకినాడ యువవాహిని ఆధ్వర్యంలో “మేళకర్త రాగాంజలి” సంగీత నృత్య దృశ్యమాలిక


విదుషి శ్రీమతి పెద్దాడ సూర్యకుమారి గారికి సన్మానం.


గాయని శ్రీమతి కనుమూరి రాజ్యలక్ష్మి గారికి సన్మానం


విదుషి శ్రీమతి చావలి సూర్యకుమారిగారికి సన్మానం


విద్వాన్ శ్రీ ఆకొండి శ్రీనివాస రాజారావు గారికి సన్మానం.


విద్వాన్ శ్రీ విష్ణుభట్ల శ్రీరామచంద్రమూర్తి గారికి సన్మానం


నాదస్వర విద్వాంసులు శ్రీ రహమాన్ గారికి సన్మానం


వాయులీన విద్వాంసులు శ్రీ కొక్కొండ తారక సుబ్బరాయన్ గారికి సన్మానం


నాట్యాచార్యులు శ్రీ లోకేశ్, శ్రీమతి కృష్ణవేణి దంపతులకు సన్మానం


నాట్యాచార్యులు శ్రీ ఆనెం ప్రసాద్ గారికి సన్మానం


చివరగా నాట్యగురువులు శ్రీ పైడా శ్రీనివాస్, శ్రీమతి అర్చన శివపార్వతులుగా మేళకర్త రాగాల పై నాట్య కార్యక్రమాన్ని రక్తి కట్టించారు.


కాకినాడ సత్కళావాహిని నిర్వాహకులు , 72మేళకర్త రాగాల కార్యక్రమ సంధానకర్త విద్వాన్ శ్రీ ఈయుణ్ణి కృష్ణమాచార్యులు, శ్రీమతి కుంజికాలక్ష్మి గారలకు సన్మానం.



Editor & Publisher : Ganakala, M.Venkatarao
30-1-29, Rangayyanaidu St, Kakinada - 1, Cell, 9441488721